'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 32 | బుధవారం | 16.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 32 | Tuesday | 16.9.2026 | Pages: 8 | Rate: 2



## ట్రంప్‌నకు కోర్టు షాక్.. జడ్జిపై అధ్యక్షుడు ఫైర్

**విదేశీ విద్యార్థులకు న్యాయస్థానంలో ఊరట**

అమెరికాలో విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల వీసాలపై ట్రంప్ ప్రభుత్వం తీసుకురావాలనుకున్న కొత్త నిబంధనకు ఫెడరల్ కోర్టు బ్రేక్ వేసింది. అమెరికాలో ఎంతకాలం ఉండొచ్చనే విషయంలో వీసా గడువును పరిమితం చేస్తూ, ఆ తర్వాత తప్పనిసరిగా పొడిగింపు కోసం దరఖాస్తు చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదనను సెప్టెంబర్ 14న న్యాయమూర్తి తాత్కాలికంగా అడ్డుకున్నారు. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న జర్నలిస్టులకు తక్షణ ఉపశమనం లభించింది. (3లో..)



## కాంగ్రెస్‌లో భారీ మార్పులు

**ముఖ్యులతో రాహుల్ మంతనాలు**

కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులపై కసరత్తు వేగం పుంజుకుంది. ఏఐసీసీ కార్యదర్శుల స్థాయిలో సాధ్యమైన పునర్వ్యవస్థీకరణకు ముందు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ మంగళవారం పలువురు కార్యదర్శులతో విడతలవారీగా సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు జరిగిన ఈ సమావేశాలు సాధారణ భేటీలుగా కాకుండా ఇంటర్వ్యూ తరహాలో సాగినట్లు సమాచారం. కార్యదర్శులు తమ రాష్ట్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, సంస్థ కోసం చేస్తున్న కృషి, భవిష్యత్ ప్రణాళికలపై నాయకత్వం ఆరా తీసింది. కార్యదర్శుల పనితీరు, పార్టీకి వారు అందిస్తున్న సహకారం, భవిష్యత్‌లో వారి పాత్రపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. (వివరాలు 3లో..)

## వారసత్వ పరిరక్షణకు సహకారం

- అగాఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం
- ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌-తో సీఎం భేటీ

తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణలో అగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం ప్రశంసించారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించామని, కుతుబ్‌షాహీ సమాధుల పునరుద్ధరణలోనూ సంస్థ విశేష కృషి చేసిందని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణకు అగా ఖాన్ ఫౌండేషన్ సహకారం కోరుతున్నామని వెల్లడించారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవనం నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న భవనాన్ని వారసత్వ కట్టడంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని చెప్పారు. మూసీని నైట్ ఎకానమీకి అనుగుణంగా తీర్చిదిద్దుతామని సీఎం పేర్కొన్నారు. (వివరాలు 2లో..)





2లో..

## 'మా మధ్య ఎలాంటి గ్యాప్ లేదు'

**సీఎంతో విభేదాలపై పీసీసీ చీఫ్ క్లారిటీ**

టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరి మధ్య గ్యాప్ ఉందన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమేనని, ఒకవేళ అభిప్రాయ భేదాలు వచ్చినా అదే రోజు సాయంత్రానికే పరిష్కరించుకున్నామని తెలిపారు. రేవంత్‌రెడ్డి పార్టీ వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదన్నారు. గత రెండేళ్లలో బూత్ స్థాయి వరకు కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కట్టుబాటుతో పనిచేశానని చెప్పారు. రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చూడటమే రేవంత్‌రెడ్డితో కలిసి తమ ప్రధాన లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కొండా సురేఖ ఛాంబర్‌కు తాళం

**ప్రభుత్వం కీలక నిర్ణయం**

తెలంగాణ సచివాలయంలో మాజీ మంత్రి కొండా సురేఖకు కేటాయించిన కార్యాలయాలను అధికారులు సీజ్ చేశారు. సచివాలయంలోని నాలుగో అంతస్తు 4ఎఫ్ విభాగంలోని 10, 11, 12 నంబర్ గదులకు తాళాలు వేసి సీల్ చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో ఈ గదులను ప్రభుత్వం ఆమెకు కేటాయించింది. ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు కేటాయించిన ఛాంబర్లను అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంగళవారం ఈ ప్రక్రియ చేపట్టారు. మంత్రి పదవి కోల్పోయిన కొద్దిరోజులకే కార్యాలయాలను సీజ్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. (వివరాలు 2లో..)






## తప్పు చేస్తే శిక్షించాల్సిందెవరు?

**పంచాయితీ పేరుతో పైశాచికం**

ఒక మహిళ తప్పు చేసిందని ఆరోపణ వస్తే.. ఆమెను అవమానించే హక్కు ఎవరికుంది? హింసించే అధికారం ఎవరిచ్చారు? కోరుట్ల మండలం అయిలాపూర్‌లో వెలుగుచూసిన ఘటన సమాజం మనసాక్షినే ప్రశ్నిస్తోంది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆరోపిస్తూ ఊరి పొలిమేరల్లో కులపెద్దలు పంచాయితీ పెట్టినట్లు సమాచారం. ఆ పంచాయితీలో మహిళను వివస్త్రను చేసి దాడి చేసినట్లు, ఆమె శరీరంపై కారం, జీడిరసం పూసి అమానుషంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. (వివరాలు 2లో..)



## పేమెంట్స్ పిడుగు

**స్కాన్ చేస్తే చెల్లింపు.. ఆ రోజులు పోతాయా?**
**మళ్లీ నగదు లావాదేవీల సీజన్ రాబోతుందా?**
**యూపీఐపై ఛార్జీల వెనుక రహస్యం?**
**2 వేలు దాటితే 0.4% ఛార్జీలు.. గరిష్టంగా రూ. 300 మోత!**
**వ్యాపారి రుసుము అంటున్నా.. సామాన్యుడి జేబుకే చిల్లు!**

6లో..

ఇప్పటి వరకు మీరు చేసే చెల్లింపులు ఆగిపోయేలా సీన్ కన్పిస్తోంది. ఇప్పటి వరకు స్కాన్ చేస్తే పైసలు తీసుకున్న వ్యాపారులు ఇకపై నో స్కాన్.. ఓన్లీ క్యాష్ అనేలా సీన్ మారిపోబోతోంది. దేశంలో స్కాన్ యూపీఐ అంటే ఇప్పుడు కేవలం చెల్లింపు విధానం కాదు.. కోట్లాది భారతీయుల రోజువారీ జీవితంలో విడదీయలేని భాగం. టీ దుకాణం నుంచి పెద్ద దుకాణం వరకు.. కూరగాయల బండి నుంచి ఆసుపత్రి వరకు.. ఫోన్ తీసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే క్షణాల్లో చెల్లింపు పూర్తవుతోంది. ఇంతకాలం ఉచితంగా సాగిన ఈ డిజిటల్ ప్రయాణంలో ఇప్పుడు రూ. 2,000 కొత్త చర్చకు తెరతీసింది. ఆపై చేసే చెల్లింపులకు 0.4 శాతం చార్జీలంటోంది. గరిష్టంగా 300 రూపాయల మోత తప్పదంటోంది. రూ. 2,000 దాటిన చెల్లింపులపై మాత్రమే అక్టోబర్ 15 నుంచి రుసుము వసూలు చేయబోతున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తేల్చి చెప్పింది. దీంతో సామాన్యుడిలో గుబులు మొదలైంది. వ్యాపారి చెల్లించే రుసుము చివరికి వస్తువుల ధరల్లో కలిసిపోతే.. భారం మళ్లీ సామాన్యుడి జేబుకేనా? యూపీఐని ప్రోత్సహించిన దేశంలో నగదు మళ్లీ చేతులు మారుతుందా? ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలేంటి? కేంద్రం చెబుతున్న సమాధానం ఏమిటి? రూ. 2,000 వెనుక అసలు కథ ఏంటి?




## ₹2,000 దాటితే యూపీఐకి ఛార్జీ

**అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధన**

యూపీఐ చెల్లింపులపై కీలక మార్పు రాబోతోంది. ₹2,000కు మించిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీ విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు ప్రకటించింది. ఈ విధానం 2026 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. అయితే సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చేలా వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ₹2,000 వరకు వ్యాపార చెల్లింపులు కూడా ఛార్జీ నుంచి మినహాయింపు పొందుతాయి. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు పూర్తిగా ఎండీఆర్ మినహాయింపు ఉంటుంది. (వివరాలు 2లో..)



## ప్రపంచ దేశాల చూపు ఇండియా వైపు

- ఫలిస్తోన్న రెండు దశాబ్దాల దౌత్యం
- నాయకత్వానికి చిరునామాగా భారత్

5లో..

ఒకప్పుడు ప్రపంచ శక్తుల మధ్య నిలబడి.. ఇప్పుడు ప్రపంచాన్ని తనవైపు తిప్పుకుంటున్న భారత్! న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు కేవలం మరో అంతర్జాతీయ సమావేశం కాదు.. భారత దౌత్య శక్తికి కొత్త నిర్వచనం. చైనా, రష్యా, ఇరాన్, సౌదీ అరేబియా వంటి పరస్పర ప్రయోజనాలు, విభేదాలు ఉన్న దేశాలు ఒకే వేదికపైకి వచ్చాయి. కొద్ది నెలల క్రితం ఒక్క ఉమ్మడి ప్రకటనపై కూడా ఏకాభిప్రాయం కుదరని బ్రిక్స్.. ఢిల్లీలో భారత అధ్యక్షతన ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఐరాస భద్రతా మండలిలో భారత్ పాత్రకు చైనా, రష్యా మద్దతు.. పహల్గామ్ ఉగ్రదాడిపై 11 దేశాల ఖండన.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గ్లోబల్ సౌత్‌కు అధిక ప్రాతినిధ్యం.. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం.. సురక్షిత సముద్ర మార్గాలు.. ఇవన్నీ ఒకే కథ చెబుతున్నాయి. భారత్ ఇక ఏ శిబిరంలో చేరాలి అని ఆలోచించే దేశం కాదు.. వివిధ శక్తులను ఒకే వేదికపైకి రప్పించి అజెండాను నిర్దేశించే దేశం. అదే సమయంలో పుతిన్‌తో కీలక భేటీ, జిన్‌పింగ్‌తో చర్చలు, అమెరికాయూరప్ భాగస్వామ్యాల మధ్య సమతుల్యత.. ఢిల్లీ దౌత్యానికి మరో కోణాన్ని చూపించాయి. ఇది నాన్‌అలైన్‌మెంట్ ముగింపా? లేక భారత్ కేంద్రంగా కొత్త ప్రపంచ సమీకరణానికి ఆరంభమా? అసలు కథ ఏంటి?



## ప్రజల భూములకు విముక్తి ఎప్పుడు?

**22ఏ భూములపై రఘునందన్ రావు ఫైర్**

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 22ఏపై అసెంబ్లీలో చర్చ జరుగుతుందని ప్రజలు ఆశించారని, అది ఎందుకు జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. (2లో..)



## 22ఏ అక్రమాలపై న్యాయవిచారణ జరపాలి

**భూ అక్రమాలపై సర్కారుపై కేటీఆర్ ఫైర్**

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో భూముల వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 22ఏ జాబితాలో ప్రజల ఆస్తులను చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. (2లో..)



## మాట తప్పడం సీఎం ట్రేడ్‌మార్క్

**ఉద్యోగులపై రేవంత్ నిర్లక్ష్యమన్న కవిత**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. 'మాట తప్పడం.. మడమ తిప్పడం రేవంత్‌రెడ్డి ట్రేడ్‌మార్క్' అంటూ ఆరోపించారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యోగుల (వివరాలు 2లో..)

## లోతుకుంట భూములపై సుప్రీం నిర్ణయం

**ప్రభుత్వానికి సుప్రీం షాక్**

- శాంతా శ్రీరామ్ భూములు
- హైకోర్టు తీర్పునే సమర్థన

శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సంస్థకు అనుకూలంగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేయాల్సిన గడువును ప్రభుత్వం పాటించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వ పిటిషన్‌ను తిరస్కరించింది. సికింద్రాబాద్ పరిధిలోని లోతుకుంట గ్రామంలో సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రైవేట్ ఆస్తి అని కోర్టు పేర్కొంది. (2లో..)

- అసలు విషయం ఇదేనన్న రంగనాథ్
- సాంకేతిక కారణాలతో పిటిషన్ కొట్టివేత





2లో..

## పసుపు నీళ్ల శుద్ధితో రాజకీయ రగడ

**కేసీఆర్ ఫామ్‌హౌస్ ఎపిసోడ్‌లో ట్విస్ట్**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన పసుపు నీళ్ల శుద్ధి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి దారితీసింది. సెప్టెంబర్ 8న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి సమీపంలోని వరదరాజాపూర్‌లోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ దళిత నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు అక్కడ పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఈ చర్య దళితులను అవమానించేలా ఉందని కాంగ్రెస్ ఎస్సీ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## రాజీనామాకు సై.. వెనక్కి తగ్గను

- » హైదర్‌నగర్ భూముల వ్యవహారం
- » మంత్రి సభను తప్పుదోవ పట్టించారు
- » కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ఫైర్

హైదర్‌నగర్ భూముల రిజిస్ట్రేషన్ల అంశం తెలంగాణ అసెంబ్లీలో రాజకీయ వేడిని పెంచింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రంగా స్పందించారు. సర్వే నంబర్లు 145, 163లోని భూములకు ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు జరగలేదని మంత్రి చెప్పడం వాస్తవం కాదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాది పాటు ఆయా భూముల రిజిస్ట్రేషన్లు



జరిగాయని స్పష్టం చేశారు. ఈ విషయంలో మంత్రి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని కృష్ణారావు విమర్శించారు. (వివరాలు 2లో..)

# 22ఏ అక్రమాలపై న్యాయవిచారణ జరపాలి

## భూ అక్రమాలపై సర్కారుపై కేటీఆర్ ఫైర్



ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో భూముల వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 22ఏ జాబితాలో ప్రజల ఆస్తులను చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 30 శాతం కమీషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితా నుంచి ఎలాంటి షరతులు లేకుండా తొలగించి, ప్రజలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని అన్నారు. ధరణి ప్రజలకు రక్షణ కవచంలా ఉండేదని, ఇప్పుడు భూభారతి పేరుతో 'భూ హారతి'గా మార్చేశారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### రెండేళ్లలో బీఆర్ఎస్ వస్తుంది

అసైన్డ్ భూముల విషయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని విమర్శించారు. 22ఏ వ్యవహారాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భూముల విషయంలో సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని చెప్పారు. రెండేళ్లలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటివరకు జరిగిన భూ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి, అన్ని అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తామని ప్రకటించారు.

# ₹2,000 దాటితే యూపీఐకి ఛార్జీ

## అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధన




యూపీఐ చెల్లింపులపై కీలక మార్పు రాబోతోంది. ₹2,000కు మించిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీ విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు ప్రకటించింది. ఈ విధానం 2026 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. అయితే సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చేలా వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ₹2,000 వరకు వ్యాపార చెల్లింపులు కూడా ఛార్జీ నుంచి మినహాయింపు పొందుతాయి. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు పూర్తిగా ఎండీఆర్ మినహాయింపు ఉంటుంది.

### చిన్న వ్యాపారులకు భారీ ఊరట

నెలకు యూపీఐ QR ద్వారా ₹1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎలాంటి మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చెల్లించాల్సిన అవసరం లేదు. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి కీలక రంగాల్లో ₹2,000కు మించిన లావాదేవీలకు శాతం ఆధారంగా కాకుండా లావాదేవీకి రూ.5 ఫ్లాట్ ఎండీఆర్ విధిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు 0.02 శాతం ఎండీఆర్, గరిష్ఠంగా రూ.300 పరిమితి ఉంటుంది. ₹75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన సాధారణ వ్యాపార లావాదేవీలపై కూడా గరిష్ఠంగా రూ.300కే పరిమితం చేస్తారు. వసూలైన ఎండీఆర్‌లో 0.4 శాతం మొత్తం బ్యాంకులు, యాప్ ప్రొవైడర్లు సహా చెల్లింపు వ్యవస్థ భాగస్వాముల మధ్య పంచబడుతుంది.

### వినియోగదారులపై భారం ఉండదు

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం P2P లావాదేవీలు మొత్తం యూపీఐ లావాదేవీల్లో 37 శాతం పరిమాణం, 70 శాతం విలువను కలిగి ఉన్నాయి. వ్యాపార లావాదేవీల్లో కూడా కేవలం 4 శాతం లావాదేవీలకే కొత్త MDR వర్తిస్తుంది. బ్యాంకులు ఈ ఛార్జీలను వినియోగదారులపై మోపకుండా వ్యాపారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం తెలిపింది. యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా మరింత స్వయం సమృద్ధిగా మార్చడం, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరణకు ప్రోత్సాహం ఇవ్వడం కొత్త విధానం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది. చిన్న వ్యాపారుల్లో యూపీఐ వినియోగాన్ని పెంచేందుకు వసూలయ్యే మొత్తం MDRలో 5 శాతాన్ని ప్రత్యేక నిధికి కేటాయించనున్నారు.

# ప్రజల భూములకు విముక్తి ఎప్పుడు?

## 22ఏ భూములపై రఘునందన్ రావు ఫైర్



తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 22ఏపై అసెంబ్లీలో చర్చ జరుగుతుందని ప్రజలు ఆశించారని, అది ఎందుకు జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గుడులు, బడులు, దేవస్థానాలు, ప్రభుత్వ భూములను రిజిస్టర్ చేయకుండా 22ఏ చట్టం తీసుకొచ్చారని గుర్తుచేశారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సరైన సమాచారం లేకుండా అసెంబ్లీకి వచ్చారని విమర్శించారు. తన పార్లమెంట్ పరిధిలోని సింఫనీ హోంలో రిజిస్ట్రేషన్ల సమస్యపై మాట్లాడితే.. బీఆర్ఎస్ నేతలు కూడా ఇదే అంశం ప్రస్తావించారని బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ప్రచారం చేయడం సరికాదన్నారు.

### కోటి ఎకరాల లెక్క చెప్పాలి

22ఏలో ఉన్న 47,440 ఎకరాలను ఎక్కడ, ఏ గ్రామాల్లో తొలగించారో మంత్రి పొంగులేటి స్పష్టం చేయాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 22ఏలో చేర్చిన భూములను తొలగించామని చెబుతున్న కాంగ్రెస్.. వాటిని చేర్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. 22ఏలో కోటి రెండులక్షల ఎకరాలకు పైగా భూమి ఎలా చేరింది? ఎప్పటిలోగా తొలగిస్తారు? అని నిలదీశారు. భూ భారతి వచ్చిన తర్వాత కూడా తప్పులు జరిగాయని మంత్రి అంగీకరించారని తెలిపారు. పేదలకు అన్యాయం చేసిన అధికారులు, కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని, భూ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. రాష్ట్రంలోని భూ కేసులను రాష్ట్ర ప్రభుత్వమే దర్యాప్తు చేయాలని, ప్రతి అంశంలో కేంద్రం జోక్యం అవసరం లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే కమిటీల పేరుతో కాలయాపన చేయబోమని స్పష్టం చేశారు.

# వారసత్వ పరిరక్షణకు సహకారం

- అగాఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం
- ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ తో సీఎం భేటీ



### గ్లోబల్ సమ్మిట్‌కు ప్రత్యేక ఆహ్వానం

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పక హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ ను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు సమ్మిట్‌కు రానున్నారని తెలిపారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని, ఇది నెట్ జీరో సిటీగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. విమానాశ్రయానికి కేవలం 20 నిమిషాల దూరంలో ఈ నగరం ఉంటుందని వివరించారు. సింగపూర్‌కు చెందిన సంస్థ ఫ్యూచర్ సిటీ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోందని తెలిపారు. 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామని, అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలు ప్రారంభించాయని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

# 'మా మధ్య ఎలాంటి గ్యాప్ లేదు'

## సీఎంతో విభేదాలపై పీసీసీ చీఫ్ క్లారిటీ

## కులగణనపై కీలక హామీ

తెలంగాణలో నిర్వహించిన కుల సర్వే సామాజిక న్యాయానికి దోహదపడిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల సర్వే అంశాన్ని పక్కన పెట్టడం బాధాకరమని, కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల సర్వేను అమలు చేస్తామని తెలిపారు. మరోవైపు మంత్రి కొండా సురేఖపై పార్టీ తీసుకున్న చర్యపై తాను బాధపడ్డానని చెప్పారు. అయితే ఏఐసీసీ నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడిగా అమలు చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నాయకుడి స్థాయి లేదా ప్రభావంతో సంబంధం లేకుండా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# మాట తప్పడం సీఎం ట్రేడ్‌మార్క్

## ఉద్యోగులపై రేవంత్ నిర్లక్ష్యమన్న కవిత




గత 32 నెలలుగా ఆరు డీఏలు బకాయి ఉన్నాయని, పీఆర్సీ, పెన్షన్లు, రిటైర్‌మెంట్ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అడిగే ఉద్యోగులను బెదిరించడం సరికాదని, వారు ప్రభుత్వానికి బానిసలు కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దాదాపు 40 శాతం టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని, ఉన్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. 2003లో నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### హెల్త్ కార్డులు పనిచేయడం లేదంటూ ఆరోపణ

ఉద్యోగుల హెల్త్ కార్డులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కవిత కోరారు. హెల్త్ కార్డులు పనిచేయకపోతే సీఎం రాజీనామా చేస్తారా? అంటూ సవాల్ విసిరారు. పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, ఆర్టీసీ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 206 ఉద్యోగ సంఘాలు జేఏసీగా ఏర్పడి 37 డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచాయని, వాటిలో చాలా వాటికి పెద్దగా ఆర్థిక భారం లేదని చెప్పారు. సెప్టెంబర్ 18లోగా సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేకపోతే ఉద్యోగ సంఘాలు హైదరాబాద్ దిగ్బంధానికి పిలుపునివ్వాలని, తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉద్యోగులను 'డెవలప్‌మెంట్ పార్ట్‌నర్స్'గా గుర్తించి గౌరవంగా చూస్తామని కవిత ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.



# పసుపు నీళ్ల శుద్ధితో వివాదం రగడ

## కేసీఆర్ ఫామ్‌హౌస్ ఎపిసోడ్‌లో ట్విస్ట్

కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన పసుపు నీళ్ల శుద్ధి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి దారితీసింది. సెప్టెంబర్ 8న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి సమీపంలోని వరదరాజాపూర్‌లోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ దళిత నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు అక్కడ పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఈ చర్య దళితులను అవమానించేలా ఉందని కాంగ్రెస్ ఎస్సీ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, బీఎన్ఎస్ తదితర సెక్షన్ల కింద మార్కుక్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫోటోలు, వీడియోలు పరిశీలించిన పోలీసులు మొత్తం 15 మంది ఈ ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించారు.

### ఏడుగురి అరెస్టు.. మిగిలినవారిపై వేట

ఈ కేసులో ఏడుగురిని సెప్టెంబర్ 14న విజయవాడలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని గజ్వేల్ కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది. మిగిలిన నిందితులను కూడా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ వివాదానికి అసలు కారణం సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలు. వర్షాకాల సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ పాలనపై నిరసన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, విజయ్‌కుమార్‌రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో వారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నిరసన వెనుక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి కుట్ర జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది.

### అరెస్టులపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

మరోవైపు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిని అరెస్ట్ చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఏడేళ్లలోపు శిక్ష ఉండే సెక్షన్ల కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించకుండా అరెస్ట్ ఎలా చేస్తారని ప్రశ్నించింది. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని సూచించింది. ఈ ఘటనపై కాంగ్రెస్ దళితులను అవమానించారని ఆరోపిస్తుండగా, బీఆర్ఎస్ మాత్రం రాజకీయ కక్షతోనే కేసులు పెట్టారని విమర్శిస్తోంది. దీంతో అరెస్టులు, హైకోర్టు జోక్యం ఈ వ్యవహారాన్ని మరింత రాజకీయంగా మార్చాయి.



# శాంతా శ్రీరామ్ భూములు

- ప్రభుత్వానికి సుప్రీం షాక్
- హైకోర్టు తీర్పునే సమర్థన

శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సంస్థకు అనుకూలంగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేయాల్సిన గడువును ప్రభుత్వం పాటించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వ పిటిషన్‌ను తిరస్కరించింది. సికింద్రాబాద్ పరిధిలోని లోతుకుంట గ్రామంలో సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రైవేట్ ఆస్తి అని కోర్టు పేర్కొంది.

### హైడ్రాపై జోక్యానికి బ్రేక్

ఈ 40 ఎకరాల భూమిలో హైడ్రా, ఇతర ప్రభుత్వ విభాగాలు, పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పదేపదే ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను పదవి నుంచి తప్పించాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. అయితే దీనిపై డివిజన్ బెంచ్ ఆదేశాలను నిలిపివేసింది. అదే సమయంలో వివాదాస్పద 40 ఎకరాల భూమిలోకి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహా అధికారులు ప్రవేశించకూడదని, జోక్యం చేసుకోకూడదని ఆదేశించింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఈ భూమి ప్రైవేట్ ఆస్తి అన్న హైకోర్టు వైఖరికి బలం చేకూరింది.

# లోతుకుంట భూములపై సుప్రీం నిర్ణయం

- అసలు విషయం ఇదేనన్న రంగనాథ్
- సాంకేతిక కారణాలతో పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్ లోతుకుంటలోని 40 ఎకరాల భూ వివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకోవడంతో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కాలపరిమితి ముగిసిన కారణంగా సాంకేతిక అంశాల ఆధారంగా సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన తెలిపారు. కోర్టు ఆదేశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం, అన్ని భాగస్వామ్య వర్గాలతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. లోతుకుంట భూముల వాస్తవ పరిస్థితి స్పష్టంగా తేలేందుకు జనరల్ ల్యాండ్ రిజిస్టర్ నంబర్ 243లోని 119 ఎకరాలపై సమగ్ర సర్వే అవసరమని రంగనాథ్ అభిప్రాయపడ్డారు. సర్వే పూర్తయితే భూముల హద్దులు, వాస్తవ స్థితిగతులు స్పష్టమవుతాయని పేర్కొన్నారు.

### మూడు కిలోమీటర్ల దూరంపై హైడ్రా వాదన

లోతుకుంటలోని సర్వే నంబర్లు 1, 2లో శాంతా శ్రీరామ్ బిల్డర్స్ లేఔట్‌కు హైడ్రా ప్రస్తుతం పరిరక్షిస్తున్న ప్రభుత్వ భూమికి దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఉందని గతంలో హైకోర్టుకు వివరించిన విషయాన్ని రంగనాథ్ గుర్తుచేశారు. సర్వే నంబర్లు 1, 2కు సంబంధించిన ప్రైవేట్ భూమిపై కోర్టు ఉత్తర్వులకు GLR నంబర్లు 243, 255లోని భూములతో ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. రెండు ప్రాంతాల భౌగోళిక స్థానం, హద్దులు వేర్వేరుగా ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం, శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించాయి. తాజాగా ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది.

# కొండా సురేఖ ఛాంబర్‌కు తాళం



### ప్రభుత్వం కీలక నిర్ణయం

ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు కేటాయించిన ఛాంబర్లను అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంగళవారం ఈ ప్రక్రియ చేపట్టారు. మంత్రి పదవి కోల్పోయిన కొద్దిరోజులకే కార్యాలయాలను సీజ్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### పేషీల్లో సిబ్బందికీ మార్పులు

ఛాంబర్‌తో పాటు కొండా సురేఖకు చెందిన మూడు పేషీలకు కూడా అధికారులు తాళాలు వేశారు. ఆమె పేషీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించి, పలువురిని తిరిగి వారి సొంత శాఖలకు పంపించారు. దీంతో మాజీ మంత్రి కార్యాలయ వ్యవస్థ పూర్తిగా ముగిసినట్లైంది. పదవి నుంచి బర్తరఫ్ తర్వాత వెంటనే ఛాంబర్ల సీజ్, సిబ్బంది బదిలీ జరగడం తాజా పరిణామంగా నిలిచింది. కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న క్రమశిక్షణ చర్యల నేపథ్యంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

# రాజీనామాకు సై.. వెనక్కి తగ్గను

- హైదర్‌నగర్ భూముల వ్యవహారం
- మంత్రి సభను తప్పుదోవ పట్టించారు
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ఫైర్




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాది పాటు ఆయా భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయని స్పష్టం చేశారు. ఈ విషయంలో మంత్రి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని కృష్ణారావు విమర్శించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. 22ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

### అబద్ధమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

హైదర్‌నగర్ భూముల విషయంలో తన వాదనకు పూర్తి ఆధారాలు ఉన్నాయని కృష్ణారావు తెలిపారు. తనను అసెంబ్లీలో మాట్లాడేందుకు అనుమతిస్తే 22ఏ భూములకు సంబంధించిన అన్ని పత్రాలను సభ ముందు ఉంచి వాస్తవాలను నిరూపిస్తానని సవాల్ చేశారు. తాను చెప్పిన విషయాలు అబద్ధమని నిరూపితమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఆయన, ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిందేనన్నారు. రిజిస్ట్రేషన్లు ఎప్పుడు జరిగాయి, ఎప్పుడు నిలిచిపోయాయి, 22ఏ నిబంధనలు ఎలా అమలయ్యాయి అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగితే అసలు విషయం బయటపడుతుందని పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలతో సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని కృష్ణారావు స్పష్టం చేశారు.



# తప్పు చేస్తే శిక్షించాల్సిందెవరు?

## పంచాయితీ పేరుతో పైశాచికం

ఒక మహిళ తప్పు చేసిందని ఆరోపణ వస్తే.. ఆమెను అవమానించే హక్కు ఎవరికుంది? హింసించే అధికారం ఎవరిచ్చారు? కోరుట్ల మండలం అయిలాపూర్‌లో వెలుగుచూసిన ఘటన సమాజం మనసాక్షినే ప్రశ్నిస్తోంది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆరోపిస్తూ ఊరి పొలిమేరల్లో కులపెద్దలు పంచాయితీ పెట్టినట్లు సమాచారం. ఆ పంచాయితీలో మహిళను వివస్త్రను చేసి దాడి చేసినట్లు, ఆమె శరీరంపై కారం, జీడిరసం పూసి అమానుషంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్రమైన నొప్పితో బాధితురాలు కేకలు వేసినా కనికరం చూపకుండా వేధింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. మరింత బాధాకరమైన విషయం.. సాటి మహిళలు కూడా ఈ దాడిలో భాగస్వాములైనట్లు ఆరోపణలు రావడం. తప్పు జరిగితే చట్టం ఉంది, పోలీసులున్నారు, న్యాయస్థానాలున్నాయి. కానీ పంచాయితీ పేరుతో ఒక మనిషి గౌరవాన్ని తుంచే హక్కు ఎవరికీ లేదు.

### పంచాయితీనా.. న్యాయానికి సమాధి?

ఈ ఘటన కేవలం ఒక మహిళపై జరిగిన దాడిగా చూడలేం. ఆమెపై ఆరోపణ నిజమా కాదా అన్నది పక్కనపెడితే.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదు. గ్రామాల్లో కులపెద్దల తీర్పుల పేరుతో ఇలాంటి దారుణాలు కొనసాగితే బాధితులకు రక్షణ ఎక్కడ? మహిళల గౌరవం, భద్రతపై సమాజం చెప్పే మాటలకు విలువ ఎక్కడ? బాధితురాలి కేకలు వినిపించినా ఆపని మనస్తత్వం మనలో ఎంతటి మానవత్వం మిగిలిందో ప్రశ్నిస్తోంది. ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానిజాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. కానీ ఈ ఘటన మాత్రం ఒక గట్టి ప్రశ్నను మన ముందుంచింది.. పంచాయితీ పేరుతో మనిషి గౌరవాన్ని తుంచే సమాజాన్ని మనం ఇంకా మౌనంగా చూస్తూనే ఉండాలా?



# సామాన్యుడిలా ఎమ్మెల్యే తనిఖీలు

- **అసలు విషయం ఏంటంటే?**

ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులకు సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వినూత్నంగా వ్యవహరించారు. బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని సాధారణ వ్యక్తి మాదిరిగా సందర్శించి అధికారుల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా కార్యాలయంలోకి వెళ్లిన ఎమ్మెల్యే.. అక్కడికి వచ్చిన ప్రజలతో కలిసి సుమారు గంటపాటు కార్యాలయంలోనే ఉండి సేవలు అందుతున్న తీరును గమనించారు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలను పలకరించి వారి సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### రెవెన్యూ సేవలపై నేరుగా ఆరా

ప్రజలకు అందాల్సిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ అవుతున్నాయా అనే విషయాన్ని ఎమ్మెల్యే తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన రెవెన్యూ సేవలు, ఇతర ప్రభుత్వ సేవల పరిస్థితిపైనా ఆరా తీశారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలు తమ పనుల కోసం ఎంతసేపు వేచి ఉంటున్నారు, అధికారులు, సిబ్బంది వారితో ఎలా వ్యవహరిస్తున్నారు అనే అంశాలను దగ్గరుండి గమనించారు. సాధారణ ప్రజల మాదిరిగానే కొంతసేపు వేచి ఉండి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను స్వయంగా గుర్తించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ సేవల విషయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరిశీలన చేపట్టారు.

### జాప్యం వద్దు.. నిర్లక్ష్యం అసలే వద్దు

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరితో అధికారులు గౌరవంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం సేవలు సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సేవల్లో జాప్యం, నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే స్వయంగా సామాన్యుడి మాదిరిగా కార్యాలయాన్ని సందర్శించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చిర్రి బాలరాజు తెలిపారు.

## తమిళనాడు సీఎం విజయ్
# లండన్ ఈవెంట్ రద్దు

- **భద్రతా కారణాలతో పోలీసుల జోక్యం**



లండన్‌లో తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్ పాల్గొనాల్సిన కార్యక్రమం భద్రతా కారణాలతో రద్దయింది. మంగళవారం లండన్‌లోని అత్యంత ఎత్తైన భవనం 'ద షార్డ్' వద్ద విజయ్‌ను చూసేందుకు వందలాది మంది అభిమానులు భారీగా చేరుకున్నారు. కొందరు అభిమానులు గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. అయితే జనసమూహం పెరగడంతో లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు జోక్యం చేసుకున్నారు. కార్యక్రమానికి అవసరమైన అనుమతి లభించలేదని, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు విజయ్ బృందం లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రకటించింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

### భారీగా చేరిన అభిమానులు

విజయ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానుల్లో కొందరు ఆయన బస చేసిన హోటల్ వద్ద నుంచే గంటల పాటు వేచి ఉన్నారు. కార్యక్రమం రద్దు ప్రకటన వెలువడిన తర్వాత కూడా అభిమానులు అక్కడే ఉండిపోయారు. తమిళనాడులో విజయ్‌కు ఉన్న భారీ ప్రజాదరణ లండన్‌లోనూ కనిపించిందని అభిమానుల స్పందనను బట్టి తెలుస్తోంది. అయితే అనుమతి లేకుండా భారీ జనసమూహం మధ్య కార్యక్రమం నిర్వహించడం సాధ్యం కాదని అధికారులు నిర్ణయించారు. ప్రజల రద్దీ వల్ల భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో పోలీసుల జోక్యంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు.

### పెట్టుబడుల కోసం లండన్ పర్యటన

విజయ్ ప్రస్తుతం తమిళనాడుకు పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో బ్రిటన్ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది. వాటి విలువ సుమారు రూ.12,300 కోట్లుగా పేర్కొంది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 9,400కు పైగా అధిక నైపుణ్య ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. అధునాతన తయారీ, సాంకేతిక రంగాలను ప్రోత్సహించడం పర్యటనలో ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. విజయ్ బుధవారం బ్రిటన్ పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి రానున్నారు.

# ట్రంప్ మమ్మల్నే కాపీ చేస్తున్నారు

- **డీకే శివకుమార్**
- **అమెరికా $5,000 హామీపై కాంగ్రెస్ నేత ఆసక్తికర వ్యాఖ్యలు**



కాంగ్రెస్ సంక్షేమ పథకాలనే ట్రంప్ కాపీ చేస్తున్నారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతి అమెరికన్ వయోజనుడికి $5,000 డివిడెండ్ ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2026 నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ ఆధిపత్యం నిలబెట్టుకుంటే ఈ మొత్తాన్ని అందిస్తామని ట్రంప్ సెప్టెంబర్ 9న ప్రకటించారు.

### రాష్ట్రాల నుంచి అమెరికా వరకు..

బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన శివకుమార్.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్ వంటి రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా ఇదే తరహాలో ఓటర్లకు నగదు ప్రయోజనం ప్రకటించారని అన్నారు. "మహారాష్ట్ర మమ్మల్ని కాపీ చేసింది.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్ కూడా కాపీ చేశాయి. ఇప్పుడు ట్రంప్ కాపీ చేస్తున్నారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. తమ సంక్షేమ ఆలోచనలు భారత్ దాటి ప్రపంచ స్థాయికి వెళ్తున్నాయని శివకుమార్ పేర్కొన్నారు.

### $5,000 హామీపై స్పష్టత ఏంటి?

ట్రంప్ ప్రకటించిన ప్రతిపాదనకు సంబంధించిన నిధుల సమీకరణ, అమలు విధానం ఇంకా పూర్తిగా స్పష్టంగా లేదు. ట్రంప్ టారిఫ్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రస్తావించారు. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ మాత్రం ఈ చెల్లింపులకు కాంగ్రెస్ ఆమోదం అవసరమవుతుందని చెప్పారు. FactCheck.org అంచనా ప్రకారం మొత్తం వ్యయం సుమారు $1.2 ట్రిలియన్ స్థాయిలో ఉండొచ్చని, టారిఫ్ ఆదాయంతో ఆ మొత్తాన్ని సమకూర్చడానికి అనేక సంవత్సరాలు పట్టవచ్చని పేర్కొంది.

# కాంగ్రెస్‌లో భారీ మార్పులు



- **ముఖ్యులతో రాహుల్ మంతనాలు**

కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులపై కసరత్తు వేగం పుంజుకుంది. ఏఐసీసీ కార్యదర్శుల స్థాయిలో సాధ్యమైన పునర్వ్యవస్థీకరణకు ముందు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ మంగళవారం పలువురు కార్యదర్శులతో విడతలవారీగా సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు జరిగిన ఈ సమావేశాలు సాధారణ భేటీలుగా కాకుండా ఇంటర్వ్యూ తరహాలో సాగినట్లు సమాచారం. కార్యదర్శులు తమ రాష్ట్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, సంస్థ కోసం చేస్తున్న కృషి, భవిష్యత్ ప్రణాళికలపై నాయకత్వం ఆరా తీసింది. కార్యదర్శుల పనితీరు, పార్టీకి వారు అందిస్తున్న సహకారం, భవిష్యత్‌లో వారి పాత్రపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### రాష్ట్రాల్లో పనిచేసే రోజులపై ఆరా

రాహుల్ గాంధీ కార్యదర్శులను వారు బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం నుంచి అవసరమైన సహకారం అందుతోందా అని కూడా అడిగారు. ముఖ్యంగా కార్యదర్శులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో కనీసం 15 రోజులు ప్రత్యక్షంగా ఉండాలని రాహుల్ సూచించినట్లు సమాచారం. వారు ఇప్పటివరకు ఎన్ని రోజులు రాష్ట్రాల్లో గడిపారు, ఏ కార్యక్రమాలు నిర్వహించారు, పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపట్టారన్న అంశాలను నాయకత్వం పరిశీలించింది. సంఘటన్ సృజన్ అభియాన్ వంటి కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాల్లో కార్యదర్శుల పాత్రను కూడా అంచనా వేయనున్నట్లు తెలుస్తోంది.

### బాధ్యతలపై స్పష్టత కోరుతున్న కార్యదర్శులు

సమావేశాల్లో కొందరు కార్యదర్శులు తమ సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా పాత్రలు, బాధ్యతలు స్పష్టంగా లేకపోవడం ప్రధాన సమస్యగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రాష్ట్రాల్లో పార్టీ వ్యవహారాలపై తమకు పరిమిత పాత్ర మాత్రమే ఉంటోందని, తరచూ రాష్ట్ర ఇన్‌చార్జిల నుంచి వచ్చే పనులపైనే ఆధారపడాల్సి వస్తోందని కొందరు కార్యదర్శులు అభిప్రాయపడ్డారు. తమకు మరింత బాధ్యత కల్పించడంతో పాటు, కార్యదర్శుల అభిప్రాయాలను అధికారికంగా పరిగణనలోకి తీసుకునే వ్యవస్థ ఉండాలని సూచనలు వచ్చినట్లు సమాచారం. అయితే ఒక కార్యదర్శి మాత్రం ఈ సమావేశాలను సాధారణ సంస్థాగత సమీక్ష ప్రక్రియగా అభివర్ణించారు. పార్టీ వ్యవస్థలో పనిచేస్తున్న నేతల పనితీరును ఎప్పటికప్పుడు అంచనా వేసి, బలహీనతలను గుర్తించి సంస్థను మరింత పటిష్ఠం చేయడమే ఈ భేటీల ఉద్దేశమని పేర్కొన్నారు.



# ట్రంప్‌కు కోర్టు షాక్.. జడ్జిపై ట్రంప్ ఫైర్

- **విదేశీ విద్యార్థులకు న్యాయస్థానంలో ఊరట**

అమెరికాలో విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల వీసాలపై ట్రంప్ ప్రభుత్వం తీసుకురావాలనుకున్న కొత్త నిబంధనకు ఫెడరల్ కోర్టు బ్రేక్ వేసింది. అమెరికాలో ఎంతకాలం ఉండొచ్చనే విషయంలో వీసా గడువును పరిమితం చేస్తూ, ఆ తర్వాత తప్పనిసరిగా పొడిగింపు కోసం దరఖాస్తు చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదనను సెప్టెంబర్ 14న న్యాయమూర్తి తాత్కాలికంగా అడ్డుకున్నారు. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న జర్నలిస్టులకు తక్షణ ఉపశమనం లభించింది. వీసా నిబంధనలను కఠినతరం చేయడం ద్వారా విదేశీయులపై నియంత్రణ పెంచాలని ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న సమయంలో కోర్టు తీర్పు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### మెయిల్ బ్యాలెట్లపై సుప్రీంకోర్టు అడ్డుకట్ట

మరోవైపు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ ప్రభుత్వానికి మరో కీలక షాక్ ఇచ్చింది. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో మెయిల్ ద్వారా ఓటు వేసే విధానంపై కొత్త ఆంక్షలు తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రయత్నాన్ని కోర్టు అడ్డుకుంది. ప్రస్తుత ఎన్నికలకు ఈ మార్పులు అమలు చేస్తే న్యాయపరంగా నిలబడే అవకాశం తక్కువగా ఉందని అత్యవసర ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పోస్టల్ సర్వీస్ ద్వారా మెయిల్ బ్యాలెట్లను స్వీకరించే విధానంలో మార్పులు చేసేందుకు సమయం సరిపోదని రాష్ట్ర ఎన్నికల అధికారులు కూడా వాదించారు. ఇప్పటికే తమ ఎన్నికల వ్యవస్థలు భద్రంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని వారు తెలిపారు.

### జడ్జీలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

కోర్టు తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. తనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులపై "వీరిని సుప్రీంకోర్టుకు ఎంపిక చేయలేదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కోర్టు నిర్ణయాలు అమెరికాను వెనక్కి నెట్టేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా నీల గోర్సచ్, అమీ కోనీ బారెట్, బ్రెట్ కవనాగ్ వంటి తన తొలి పదవీకాలంలో తానే నామినేట్ చేసిన న్యాయమూర్తులు కూడా తీర్పులో ట్రంప్ వైఖరికి వ్యతిరేకంగా నిలిచారు. సుప్రీంకోర్టు నిర్ణయాలు దేశానికి భారీ నష్టం కలిగిస్తున్నాయని, వాటి ప్రభావం నుంచి అమెరికా కోలుకోవడం సులభం కాదని ట్రంప్ మండిపడ్డారు.

# దలాల్ స్ట్రీట్‌కు ఐదు దెబ్బలు

- ***ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లు ఆవిరి***



భారత స్టాక్ మార్కెట్‌కు మంగళవారం భారీ షాక్ తగిలింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్ చివరికి తీవ్ర నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ రోజు గరిష్ఠం నుంచి దాదాపు 1,430 పాయింట్లు జారిపోయింది. చివరికి 778 పాయింట్ల నష్టంతో 74,003 వద్ద ముగిసింది. నిఫ్టీ 279 పాయింట్లు కోల్పోయి 23,118 వద్ద స్థిరపడింది. ఒక్కరోజులోనే బీఎస్ఈలోని కంపెనీల మార్కెట్ విలువ నుంచి రూ.9 లక్షల కోట్లకు పైగా ఆవిరైంది.

### మొదటి దెబ్బ.. అమెరికా బాండ్ ఈల్డ్స్

అమెరికా పదేళ్ల ట్రెజరీ ఈల్డ్ 5 శాతాన్ని దాటడం భారత మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువకాలం కొనసాగవచ్చన్న అంచనాలతో పెట్టుబడిదారులు రిస్క్ తగ్గించుకున్నారు. దీంతో ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు పెరిగాయి.

### రెండో దెబ్బ.. చమురు ధరల మంట

ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 108 డాలర్లు దాటడం మార్కెట్‌ను మరింత కలవరపెట్టింది. చమురు ధరలు పెరిగితే భారత్ దిగుమతి వ్యయం పెరుగుతుంది. ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్‌పై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు.

### మూడో దెబ్బ.. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు

ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, సౌదీ అరేబియాపై హౌతీ దాడులు మార్కెట్ భయాలను పెంచాయి. హోర్ముజ్ జలసంధిలో చమురు రవాణాపై ఆందోళనలు కూడా పెరిగాయి. సౌదీ ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్‌కు నష్టం వాటిల్లడం ప్రపంచ చమురు సరఫరాపై కొత్త భయాలను తెచ్చింది.

### నాలుగో దెబ్బ.. భారీ ఐపీఓల ప్రభావం

దేశీయ ప్రైమరీ మార్కెట్‌లో భారీగా ఐపీఓలు రావడం కూడా సెకండరీ మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. 11 ఐపీఓలు కలిపి రూ.24,574 కోట్లను సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. భారీ మొత్తంలో పెట్టుబడులు కొత్త షేర్ల వైపు మళ్లడంతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న మార్కెట్‌కు ఇది మరో ప్రతికూల అంశంగా మారింది.

### ఐదో దెబ్బ.. భారీ అమ్మకాలు

అమ్మకాల ఒత్తిడితో కీలక షేర్లు కుప్పకూలాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ 6 శాతానికి పైగా పడిపోయింది. ఇండిగో, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ వంటి షేర్లు 2-4 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ రియల్టీ సూచీ 4 శాతానికి పైగా క్షీణించింది. దీనికి భిన్నంగా ఐటీ షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి.

### మూడు అంశాలపై మార్కెట్ చూపు

ఇక దలాల్ స్ట్రీట్ దిశను చమురు ధరలు, అమెరికా ఫెడ్ నిర్ణయం, మధ్యప్రాచ్య పరిణామాలు నిర్ణయించనున్నాయి. ఈ మూడు అంశాల్లో ప్రతికూలత కొనసాగితే మార్కెట్‌పై మరింత ఒత్తిడి ఉండొచ్చు. ఒక్కరోజు పతనమే పెట్టుబడిదారుల సంపదలో రూ.9 లక్షల కోట్లకు పైగా నష్టాన్ని మిగిల్చింది.

# యూపీఐపై కొత్త ఛార్జీల మోత

- **రూ.2 వేల దాటితే ఎండీఆర్**



యూపీఐ చెల్లింపులపై కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. రూ.2,000కు మించిన పర్సన్ టు మర్చంట్ లావాదేవీలపై సాధారణంగా 0.4 శాతం ఛార్జీని వ్యాపారులు భరించాలి. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పీ2పీ లావాదేవీలకు ఎలాంటి ఛార్జీ ఉండదు. ఇవి మొత్తం యూపీఐ లావాదేవీల్లో పరిమాణం పరంగా 37 శాతం, విలువ పరంగా 70 శాతం ఉన్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. రూ.2,000 వరకు పీ2ఎం చెల్లింపులకు కూడా ఎండీఆర్ ఉండదు. నెలకు రూ.లక్ష వరకు యూపీఐ క్యూఆర్ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు పూర్తిగా మినహాయింపు ఉంటుంది.

### కొన్ని రంగాలకు రూ.5 ఫ్లాట్ రేట్

రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి రంగాల్లో రూ.2,000కు మించిన లావాదేవీలపై రూ.5 ఫ్లాట్ ఎండీఆర్ వర్తిస్తుంది. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు మాత్రం 0.02 శాతం ఛార్జీ, గరిష్ఠంగా రూ.300 పరిమితి ఉంటుంది. రూ.75,000కు పైబడిన సాధారణ లావాదేవీలకు కూడా ఎండీఆర్ రూ.300కే పరిమితం. వసూలయ్యే ఛార్జీలను బ్యాంకులు, పేమెంట్ యాప్ సంస్థలు సహా యూపీఐ వ్యవస్థలోని భాగస్వాములకు పంచుతారు.

### కస్టమర్లపై భారం వేయొద్దు

యూపీఐ ఛార్జీలను వ్యాపారులు వినియోగదారులపై మోపకుండా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మొత్తం మర్చంట్ లావాదేవీల్లో కేవలం 4 శాతానికే ఎండీఆర్ ప్రభావం ఉంటుందని ఆర్థిక శాఖ తెలిపింది. యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిగా మార్చడం, గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో విస్తరించడం ఈ విధానం లక్ష్యమని పేర్కొంది. ఎండీఆర్ వసూళ్లలో 5 శాతంతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి చిన్న వ్యాపారుల్లో యూపీఐ వినియోగాన్ని పెంచనున్నారు.

# క్రూడ్ క్రూరత్వం..

- **చమురు మార్కెట్‌కు యుద్ధం సెగ**
- **సరఫరా భయాలతో చమురు భగ్గు**



పశ్చిమాసియాలో వరుస దాడులు ప్రపంచ చమురు సరఫరాపై కొత్త ఆందోళనలు రేకెత్తించడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మంగళవారం భారీగా పెరిగాయి. సౌదీ అరేబియాలోని ఈస్ట్‌వెస్ట్ చమురు పైప్‌లైన్ దాడుల కారణంగా నిలిచిపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. ఉదయం 0406 GMT సమయానికి బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ $1.37 పెరిగి బ్యారెల్‌కు $107.05కు చేరాయి. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర $1.53 పెరిగి $102.92కు చేరింది. రెండు కీలక బెంచ్‌మార్క్‌లు గత సెషన్‌లోనూ 1 శాతానికి పైగా పెరిగాయి.

### పైప్‌లైన్ నిలిచిపోవడంతో పెరిగిన ముప్పు

యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ దళాలు సోమవారం దక్షిణ సౌదీలోని ఖమీస్ ముషైత్ సైనిక స్థావరంపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశాయి. ఈ దాడుల్లో విమానాల హ్యాంగర్లు, రాడార్ వ్యవస్థలు, రన్‌వేలు, మందుగుండు సామగ్రి కేంద్రాలు దెబ్బతిన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 11న జరిగిన మరో దాడి సౌదీ ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్ కార్యకలాపాలను దెబ్బతీసింది. హోర్ముజ్ జలసంధిని దాటకుండా యాన్‌బు పోర్టు ద్వారా చమురును తరలించేందుకు ఈ పైప్‌లైన్ కీలకం. రోజుకు దాదాపు 40 లక్షల బ్యారెళ్ల చమురును ఈ మార్గం ద్వారా తరలించే సామర్థ్యం ఉంది. ఇది ప్రపంచ సరఫరాలో దాదాపు 4 శాతానికి సమానం.

### హర్మూజ్‌లో రాకపోకలు తగ్గుదల

హర్మూజ్ జలసంధిలో పరిస్థితి కూడా మార్కెట్లను కలవరపెడుతోంది. వారాంతంలో ఈ మార్గంలో రోజుకు 10 కంటే తక్కువ నౌకలు మాత్రమే ప్రయాణించాయి. సాధారణంగా 10 రోజుల సగటు 14 రాకపోకలతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు చమురు ఈ మార్గం మీదుగా రవాణా అవుతుంది. పైప్‌లైన్ త్వరగా పునరుద్ధరించకపోతే సౌదీ అరేబియాలో ఎగుమతులకు అందుబాటులో ఉన్న చమురు నిల్వలు కొద్ది రోజుల్లోనే తగ్గిపోయే ప్రమాదం ఉందని కొనుగోలుదారులు, వ్యాపారులు చెబుతున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు కొన్ని వారాలు పట్టవచ్చన్న అంచనాలు ధరలపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. దాడులు కొనసాగడం, హోర్ముజ్ రాకపోకలు సాధారణ స్థితికి రాకపోవడం చమురు ధరలను మరింత పెంచే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధం.. అమెరికాకు భారీ బిల్లు

- **38 బిలియన్ డాలర్లు, రూ.3.65 లక్షల కోట్లు దాటిన ఖర్చు**
- **ఖజానాపై భారీ ప్రభావం**



ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం అమెరికా ఖజానాపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ యుద్ధానికి ఇప్పటివరకు అమెరికా 38 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత మారకం విలువ ప్రకారం ఇది సుమారు రూ.3.65 లక్షల కోట్లు. ఆయుధాల వినియోగం, క్షిపణుల ప్రయోగాలు, సైనిక కార్యకలాపాలు, ఇంధనం, యుద్ధంలో దెబ్బతిన్న పరికరాల భర్తీ వంటి ఖర్చులు ఇందులో ఉన్నాయి.

### నెలకు మరో రూ.30 వేల కోట్లు

యుద్ధం కొనసాగితే అమెరికాకు ప్రతి నెలా మరో 2 నుంచి 3 బిలియన్ డాలర్లు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. అంటే భారత కరెన్సీలో నెలకు సుమారు రూ.19,200 కోట్ల నుంచి రూ.28,800 కోట్ల వరకు అదనపు భారం పడొచ్చు. యుద్ధ తీవ్రత పెరిగితే ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అదనపు రక్షణ నిధుల కోసం అమెరికా ప్రభుత్వం భారీ మొత్తాన్ని కోరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

### ఆయుధ నిల్వలకూ దెబ్బ

యుద్ధ ప్రభావం కేవలం ఆర్థిక వ్యవస్థకే పరిమితం కావడం లేదు. అమెరికా భారీగా క్షిపణులు, మిసైల్ ఇంటర్‌సెప్టర్లను వినియోగించడంతో ఆయుధ నిల్వలపై కూడా ఒత్తిడి పెరిగింది. కొన్ని రకాల రక్షణ క్షిపణుల్లో గణనీయమైన భాగం వినియోగించినట్లు అంచనాలు ఉన్నాయి. వాటిని తిరిగి తయారు చేసి నిల్వలను పునరుద్ధరించేందుకు సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది. దీంతో ఇరాన్ యుద్ధం అమెరికాకు సైనికంగా, ఆర్థికంగా దీర్ఘకాలిక సవాలుగా మారుతోంది.

రాజ్య సంస్కరణ
బుధవారం, 16.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# మత సామరస్యానికి వేంపల్లిలో కొత్త సందేశం



వేంపల్లె పట్టణంలోని పప్పుల వీధిలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటరమణ ఆహ్వానం మేరకు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి టీడీపీ మాజీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షబ్బీర్ హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లిం సమాజానికి చెందిన టీడీపీ నేత షబ్బీర్ హిందూ పండుగలో పాల్గొనడం మత సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. మతాలకు అతీతంగా అన్ని పండుగలను గౌరవిస్తూ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా చాటిచెప్పారు. ప్రజా జీవితంలో అన్ని వర్గాలతో కలిసి పండుగల్లో పాల్గొనడం ద్వారా సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామని టీడీపీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో TNSF జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తెలుగుయువత ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, మహబూబ్ షరీఫ్, తక్కల్ల షరీఫ్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం వేంపల్లిలో మత సామరస్యానికి సరికొత్త ఉదాహరణగా నిలిచింది.

# ప్రియాతోటలో ఘనంగా విఘ్నేశ్వరుని పూజలు



వేంపల్లి పట్టణంలోని ప్రియాతోటలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో జీవి రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రియాతోటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే స్థానికులు పూజా కార్యక్రమాలకు హాజరై విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు, మహిళలు, యువతతో ప్రియాతోట పరిసరాలు సందడిగా మారాయి. పండుగ సందర్భంగా భక్తులు సామూహికంగా పూజల్లో పాల్గొని వినాయకుడి కృపతో అందరికీ మంచి జరగాలని ప్రార్థించారు. జీవి రమణ భక్తులతో కలిసి పూజల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వినాయకుడి సన్నిధిలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు పట్టణంలోని సన్ రైస్ కౌంట్రీలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా సన్ రైస్ కౌంట్రీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు అభినందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. భక్తుల సందడితో సన్ రైస్ కౌంట్రీ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

# గౌరమ్మకట్టలో యువకుడిపై కర్రల దాడి



ప్రొద్దుటూరు గౌరమ్మకట్ట వీధిలో వినాయక మండపం వద్ద ట్రాఫిక్ సర్దుబాటు చేయాలని కోరిన ధనుష్‌కుమార్‌పై ఇద్దరు వ్యక్తులు కర్రలతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి రెండు కార్లు ఎదురెదురుగా రావడంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు కొద్దిసేపు ఆగి వెళ్లాలని ధనుష్ కారులో ఉన్న వారికి సూచించినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన ఇద్దరు వ్యక్తులు కారు నుంచి దిగి ధనుష్‌పై విచక్షణారహితంగా కర్రలతో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ధనుష్ కంటికి తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా మారింది. కుటుంబ సభ్యులు తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని అరవింద్ ఐ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కంటికి తీవ్ర నష్టం జరిగిందని, పరిస్థితిని బట్టి కన్నును తొలగించాల్సి రావచ్చని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైనట్లు తెలుస్తోంది.

# రాజు అరెస్ట్.. ఆరోపణలు కలకలం



హైదరాబాద్‌లో 'ఢీ10' డ్యాన్స్ షో విజేత రాజును మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగికంగా వేధించడంతో పాటు సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. ఈ నెల 9న మియాపూర్ పోలీసులను ఆశ్రయించిన యువతి, రాజు తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాలు కల్పిస్తానని నమ్మించి వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. దీంతో రాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అయితే రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు కొంతకాలం గోప్యంగా ఉంచినట్లు సమాచారం. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు ప్రస్తుతం లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మహా ఎస్ఐఆర్‌లో భారీ కోతలు



### 2.07 కోట్ల ఓట్ల తొలగింపుపై ప్రశ్నలు

మహారాష్ట్రలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై సంచలన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రంలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకంగా 2.07 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఎస్ఐఆర్‌కు ముందు మహారాష్ట్రలో 9.79 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 21.14 శాతం మంది పేర్లు జాబితా నుంచి మాయమయ్యాయి. తొలగించిన ఓటర్ల సంఖ్య ఛత్తీస్‌గఢ్ మొత్తం ఓటర్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. అంతేకాదు, ఉత్తరప్రదేశ్‌లో ఎస్ఐఆర్ సమయంలో తొలగించిన 2.04 కోట్ల పేర్ల కంటే కూడా మహారాష్ట్రలో తొలగింపులు ఎక్కువ.

### నగర ప్రాంతాల్లోనే భారీ తొలగింపులు

తొలగింపులు ప్రధానంగా ముంబై, పుణే, థానే, నాసిక్ పరిసరాల్లోని పట్టణ నియోజకవర్గాల్లో కేంద్రీకృతమయ్యాయి. మొత్తం 58 నియోజకవర్గాల్లో కనీసం మూడో వంతు ఓటర్ల పేర్లు తొలగించారు. 25 నియోజకవర్గాల్లో తొలగింపులు 40 శాతాన్ని దాటాయి. థానేలోని భివాండి ఈస్ట్‌లో అత్యధికంగా 49.1 శాతం పేర్లు తొలగించారు. అక్కడ 3.76 లక్షల ఓటర్లలో 1.85 లక్షల పేర్లు జాబితా నుంచి తొలగిపోయాయి. మరోవైపు, 'శాశ్వతంగా తరలిపోయారు', 'గుర్తించలేకపోయారు లేదా అందుబాటులో లేరు' అనే కారణాలు పెద్ద సంఖ్యలో పేర్ల తొలగింపుకు ఉపయోగించినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. థానేలోని కల్యాణ్ రూరల్‌లో తొలగించిన 2.52 లక్షల పేర్లలో 96.5 శాతం మంది తరలిపోయినవారు లేదా అందుబాటులో లేని వారిగా గుర్తించారు.

### 'అబ్సెంట్' వర్గీకరణపై తీవ్ర సందేహాలు

మొత్తం 85 నియోజకవర్గాల్లో తొలగింపులకు 'షిఫ్టెడ్', 'అబ్సెంట్' కారణాలు 75 నుంచి 96.5 శాతం వరకు ఉన్నాయి. ఎస్ఐఆర్‌కు ముందు ఈ నియోజకవర్గాల్లో 3.21 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 1.17 కోట్ల పేర్లు తొలగించారు. అందులో 97.9 లక్షల మంది పేర్లను గైర్హాజరైన వారిగా పేర్కొన్నారు. అయితే ఎన్నికల సంఘం సొంత మార్గదర్శకాల ప్రకారం ఒక ఓటరు తాత్కాలికంగా గైర్హాజరైనా, తాను నమోదైన ప్రాంతంలో సాధారణ నివాసిగా కొనసాగితే కేవలం గైర్హాజరు కారణంతో పేరు తొలగించకూడదు. పుణే జిల్లాలోని సమీప నియోజకవర్గాల్లోనే 'అబ్సెంట్' శాతం తీవ్రంగా మారడం కూడా అనుమానాలకు తావిస్తోంది. మావల్‌లో కేవలం 0.4 శాతం మందిని గైర్హాజరుగా గుర్తించగా, హడప్సర్‌లో ఏకంగా 86 శాతం ఓటర్లను అబ్సెంట్‌గా గుర్తించారు. దీంతో తొలగింపుల ప్రక్రియలో ఏకరూపత ఉందా, లేక భారీగా పేర్లు తొలగించారా అన్న ప్రశ్నలు బలపడుతున్నాయి.

# మతమార్పిడితో ఎస్టీ హోదా పోతుందా?



### వెంటనే రద్దు కాదన్న అలహాబాద్ హైకోర్టు

మతమార్పిడి చేసినంత మాత్రాన ఒక వ్యక్తి షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదాను ఆటోమేటిక్‌గా కోల్పోరని అలహాబాద్ హైకోర్టు కీలకంగా స్పష్టం చేసింది. అయితే ఎస్టీ హోదాపై వివాదం తలెత్తినప్పుడు, ఆ వ్యక్తికి తన గిరిజన తెగతో ఇప్పటికీ సంబంధం కొనసాగుతోందా లేదా అనే అంశాన్ని న్యాయస్థానం పరిశీలించవచ్చని తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో గిరిజనులకు చెందిన వ్యవసాయ భూముల కొనుగోలుకు సంబంధించిన కేసులో ఈ తీర్పు వెలువడింది. మతం మారడం ఒక్కటే ఎస్టీ గుర్తింపును రద్దు చేసే కారణం కాదన్నది ఈ తీర్పులో ప్రధాన అంశంగా నిలిచింది.

### భూముల కొనుగోలుపై అసలు వివాదం

ఈ కేసులో భూయాన్ షెడ్యూల్డ్ ట్రైబ్‌కు చెందిన వ్యక్తి మూడు వ్యవసాయ భూముల కొనుగోలు లావాదేవీలు చేపట్టారు. అయితే అధికారిక రికార్డుల్లో ఆమె ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకుని ఇస్లాం మతంలోకి మారినట్లు వివరాలు నమోదయ్యాయి. దీంతో ఆమె భూములు కొనుగోలు చేసిన సమయంలో భూయాన్ తెగకు చెందిన ఎస్టీ సభ్యురాలిగానే కొనసాగుతున్నారా అనే ప్రశ్న ప్రధానంగా మారింది. గిరిజన భూముల బదిలీపై ఉన్న నిబంధనల ప్రకారం జరిగిన ఈ లావాదేవీల చెల్లుబాటుపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు మూడు భూముల విక్రయ పత్రాలను చెల్లనివిగా ప్రకటిస్తూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఆమె కోర్టును ఆశ్రయించారు.

### తెగతో బంధమే కీలక అంశం

అలహాబాద్ హైకోర్టు మూడు రిట్ పిటిషన్లను కొట్టివేసి, మూడు భూముల లావాదేవీలను రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. మతమార్పిడి కారణంగా మాత్రమే ఎస్టీ హోదా పోతుందని చెప్పలేమని స్పష్టం చేసిన కోర్టు, అదే సమయంలో సంబంధిత వ్యక్తి తన తెగతో కొనసాగుతున్న అనుబంధాన్ని నిరూపించాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు దానిని పరిశీలించవచ్చని పేర్కొంది. ఈ కేసులో భూయాన్ తెగతో తనకు అవసరమైన కొనసాగుతున్న సంబంధాన్ని ఆమె తగిన విధంగా నిరూపించలేకపోయారని కోర్టు నిర్ధారించింది. అందుకే భూముల లావాదేవీలను చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించలేదు. మతమార్పిడి ఒక్కటే నిర్ణయాత్మక అంశం కాదు.. తెగతో కొనసాగుతున్న సామాజిక సంబంధం కూడా కీలకమే అన్న సందేశాన్ని ఈ తీర్పు ఇచ్చింది.

# 2029 నాటికి అందరికీ ఇళ్లు లక్ష్యం



అమరావతి: 2029 నాటికి రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించేందుకు 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే నెలలోగా వివిధ కేంద్ర పథకాల కింద మంజూరైన ఇళ్లను గ్రౌండింగ్ చేయడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. ఉచిత ఇళ్ల స్థలాలకు అర్హులను డేటా అనుసంధానంతో పారదర్శకంగా గుర్తించి, అభ్యంతరాల పరిష్కారం తర్వాత తుది జాబితాలు ప్రకటించాలని ఆదేశించారు. ఖాళీ లే అవుట్ భూములను అవసరానికి అనుగుణంగా ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని సూచించారు. కేంద్ర సహకారంతో పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని, ఏపీఐఐసీతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

# ఒక్క ఓటే.. బీజేపీ అభ్యర్థికి షాక్!



సొంత ఓటు కూడా తన వార్డులో లేదు.. అయినా బరిలోకి దింపిన పార్టీ.. చివరికి కౌంటింగ్‌లో ఒకే ఒక్క ఓటు! రాజస్థాన్‌లో ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. గెలుపు కోసం బరిలోకి దిగిన ఓ అభ్యర్థికి కౌంటింగ్‌లో ఒక్కటంటే ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. విచిత్రం ఏమిటంటే.. ఆ అభ్యర్థి సొంత ఓటు కూడా తాను పోటీ చేసిన వార్డులో లేదు. దీంతో ఈ ఫలితం ఇప్పుడు రాజస్థాన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. దిద్వానాకుచామన్ జిల్లాలోని పర్బత్ సర్ మున్సిపాలిటీ 13వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా కైలాశ్ చంద్ పోటీ చేశారు. సెప్టెంబర్ 15న జరిగిన ఓట్ల లెక్కింపులో ఆయనకు కేవలం ఒక్క ఓటు మాత్రమే వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. అదే వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి హీనా ఖానమ్ 376 ఓట్లతో ఘన విజయం సాధించగా, స్వతంత్ర అభ్యర్థి రషీద్ ఖాన్ 195 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కైలాశ్ చంద్ తన సొంత ఓటును కూడా తాను పోటీ చేసిన 13వ వార్డులో వేయలేకపోయారు. ఆయన ఓటు పక్కనే ఉన్న 12వ వార్డులో ఉంది. పార్టీ ఆదేశాల మేరకే 13వ వార్డు నుంచి పోటీ చేశానని కైలాశ్ చంద్ తెలిపారు. తనకు వచ్చిన ఆ ఒక్క ఓటు కూడా 13వ వార్డుకు చెందిన ఓటరే వేసి ఉంటారని PTIకి చెప్పారు. స్థానికంగా సరైన అభ్యర్థి లేకపోవడంతో పార్టీ తనను అక్కడి నుంచి బరిలోకి దింపిందని తెలుస్తోంది. తాను ఆ వార్డుకు స్థానికుడు కాకపోవడంతో ప్రచారం కూడా పెద్దగా జరగలేదని కైలాశ్ చంద్ వివరించారు. దీంతో పార్టీ గుర్తుపై పోటీ చేసినప్పటికీ ఓటర్ల నుంచి కనీస స్థాయిలోనే మద్దతు లభించింది. ఇదిలా ఉంటే పర్బత్ సర్ మున్సిపాలిటీ మొత్తం 25 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది. కాంగ్రెస్ 13 వార్డులు గెలుచుకుని మెజారిటీ సాధించగా, బీజేపీ 12 వార్డులతో నిలిచింది. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి కైలాశ్ చంద్‌కు కేవలం ఒక్క ఓటు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల బరిలో అభ్యర్థిగా నిలిచారు.. కానీ ఆయన సొంత ఓటు మాత్రం వేరేv వార్డులో ఉంది. పార్టీ కోసం పోటీ చేశారు.. చివరికి ఒక్క ఓటుతో ముగిసింది ఆయన ఎన్నికల ప్రయాణం. రాజస్థాన్ స్థానిక ఎన్నికల ఫలితాల్లో కైలాశ్ చంద్‌కు దక్కిన 'వన్ ఓట్' ఇపుడు వైరల్ చర్చగా మారింది.



### వినూత్న రూపాల్లో గణపతి..

# భక్తితో పూజలు

ప్రొద్దుటూరు పట్టణంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వివిధ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలు తదితర నైవేద్యాలను సమర్పించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శివాలయం గణపతి సేవా సంఘం 50వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శివలింగ మహా గణపతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయనగరం వీధిలో భారీ వినాయక ప్రతిమ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. కంటి ఆసుపత్రి సమీపంలో 10,101 వక్కలతో రూపొందించిన గణపతి ప్రతిమను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. మిట్టమడి 8వ వీధిలో యువత రంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి, శ్రీరాములపేటలో నాణేలతో రూపొందించిన వినాయకుడు, సరస్వతి విద్యామందిరం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడు భక్తులను ఆకర్షించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారులు, యువతను అలరించాయి. వైఎంఆర్ కాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లోనూ ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఎక్కడ చూసినా గణపతి నామస్మరణ, భక్తిగీతాలతో పట్టణమంతా పండుగ శోభ సంతరించుకుంది.

## ప్రొద్దుటూరు మున్సిపల్ పీఠం బీసీలకే ఇవ్వాలి



ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలో సుమారు 1.37 లక్షల ఓట్లకు 80 వేల మంది వరకు బీసీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇంతటి పెద్ద సంఖ్యలో బీసీ ఓటర్లు ఉన్నందున మున్సిపల్ పీఠంలోనూ వారికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. చైర్మన్ స్థానం జనరల్‌కు వచ్చినా బీసీ అభ్యర్థినే టీడీపీ బరిలో దించాలి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో ప్రొద్దుటూరులోనూ సామాజిక ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గతంలో చైర్మన్ పదవికి సంబంధించి జరిగిన పరిణామాలపై బీసీ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.

# దసరాకు కొత్త పింఛన్లు.. భారీ ఊరట



### 2.50 లక్షల మందికి అవకాశం

తెలంగాణ ప్రభుత్వం 2.50 లక్షల కొత్త పింఛన్లను మంజూరు చేసేందుకు సిద్ధమైంది. దసరా కానుకగా అర్హులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరించారు. లక్షలాది దరఖాస్తులు రావడంతో అర్హుల ఎంపికపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి, వచ్చే నెల మొదటి వారంలో తుది జాబితా సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించింది. ఇంటింటి పరిశీలన.. ఆపై తుది జాబితా అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి కుటుంబ పరిస్థితి, ఆదాయం, అర్హతలను పరిశీలించనున్నారు. వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణ, ఒంటరి మహిళలకు విడాకుల పత్రాలు, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ఆధారం అవసరం. దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అవసరం. పత్రాల జారీలో జాప్యం కారణంగా మొదట వాటి లేకుండానే దరఖాస్తు అవకాశం కల్పించారు. తుది పరిశీలనలో ధ్రువీకరణ పత్రాలు సమర్పించినవారికే పింఛన్ మంజూరు చేస్తారు.



భారత్ విదేశాంగ విధానంలో ఒక కీలక మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు రెండు అగ్రశక్తుల మధ్య సమదూరం పాటిస్తూ తన స్వతంత్ర నిర్ణయాలను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఉన్న నాన్-అలైన్‌మెంట్ విధానం ఇప్పుడు కొత్త రూపం దాల్చింది. ఇప్పుడు భారత్ ఏ శిబిరం వైపు వెళ్లాలి అన్న ప్రశ్న కంటే.. ప్రపంచంలోని భిన్న శక్తులు భారత్‌తో ఎలా కలిసి నడవాలి అన్న ప్రశ్న కీలకంగా మారింది. న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ఈ మార్పుకు బలమైన సంకేతంగా నిలిచింది. చైనా, రష్యా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి విభిన్న ప్రయోజనాలు కలిగిన దేశాల నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. వాటిలో పరస్పర విభేదాలు ఉన్న దేశాలు కూడా ఉన్నాయి. అయినా భారత అధ్యక్షతన రూపొందిన న్యూఢిల్లీ డిక్లరేషన్ ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. కొద్ది నెలల క్రితం బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఒక్క ఉమ్మడి వాక్యంపై కూడా ఏకాభిప్రాయం రాకపోయిన పరిస్థితి నుంచి ఇంతటి ఏకాభిప్రాయానికి రావడం సాధారణ విషయం కాదు. సమావేశాన్ని నడిపించిన తీరు, సున్నితమైన అంశాలపై భాషను సమతుల్యం చేసిన విధానం, అన్ని దేశాల ప్రయోజనాలను ఒకే ఫ్రేమ్‌లోకి తీసుకురావడం భారత దౌత్య సామర్థ్యాన్ని చూపించాయి. ఒకప్పుడు భారత్ ప్రపంచ నిర్ణయాల గదిలోకి ప్రవేశం కోసం తలుపు తట్టేది. ఇప్పుడు అదే భారత్ ఆ గదికి ఇతర దేశాలను ఆహ్వానించే స్థాయికి చేరింది. ఇది కేవలం ఒక సదస్సు విజయంగా చూడలేని పరిణామం. భారతదేశం పెరుగుతున్న ఆర్థిక, దౌత్య, వ్యూహాత్మక ప్రభావానికి ఇది ప్రతిబింబం.

# ప్రపంచ దేశాల చూపు ఇండియా వైపు



- ఫలిస్తోన్న రెండు దశాబ్దాల దౌత్యం
- నాయకత్వానికి చిరునామాగా భారత్

**• గ్లోబల్ సౌత్‌కు ఢిల్లీ కొత్త వేదిక**

భారత్ బ్రిక్స్ అధ్యక్షతను కేవలం సమావేశాల నిర్వహణగా పరిమితం చేయలేదు. దేశంలోని 30 నగరాల్లో 400కు పైగా సమావేశాలు నిర్వహిస్తూ బ్రిక్స్‌ను ప్రజలతో, పరిశ్రమలతో, నిపుణులతో, యువతతో అనుసంధానించే ప్రయత్నం చేసింది. చండీగఢ్‌లో ఆరోగ్యం, ఇండోర్‌లో వ్యవసాయం, చెన్నైలో శాస్త్ర సాంకేతిక రంగం, బెంగళూరులో అంతరిక్ష రంగం, ఆగ్రాలో వ్యాపార రంగం, జైపూర్‌లో ఆర్థిక వ్యవహారాలు, కొచ్చిలో మహిళా సాధికారత, భువనేశ్వర్‌లో విద్య, నాగ్‌పూర్‌లో రవాణా, గువాహటిలో మాదకద్రవ్యాల నియంత్రణ వంటి విభిన్న అంశాలను బ్రిక్స్ అజెండాలోకి తీసుకొచ్చింది. దీని ద్వారా బ్రిక్స్ అనేది కేవలం దేశాధినేతల సమావేశం కాదని, అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలకు ఉపయోగపడే కార్యాచరణ వేదికగా మార్చాలన్న భారత లక్ష్యం స్పష్టమైంది. గ్లోబల్ సౌత్ ఇక ప్రపంచ వ్యవస్థలో కేవలం నియమాలను అనుసరించే వర్గం కాకుండా.. నియమాలను రూపొందించే శక్తిగా ఎదగాలి అన్న ప్రధాని నరేంద్ర మోదీ సందేశం ఈ మొత్తం ప్రక్రియకు కేంద్రబిందువుగా నిలిచింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల వాటా పెరిగినా, అంతర్జాతీయ సంస్థల్లో వాటి నిర్ణయాధికారం అదే స్థాయిలో పెరగలేదన్న అసంతృప్తి ఉంది. ఐఎంఎఫ్‌లో ఓటింగ్ వాటాలు, ప్రపంచ బ్యాంకులో ప్రాతినిధ్యం, ప్రపంచ వాణిజ్య సంస్థలో నిర్ణయ ప్రక్రియ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్మాణం వంటి అంశాలపై భారత్ బలమైన సంస్కరణల దిశగా అడుగులు వేసింది. 1945 నాటి ప్రపంచ నిర్మాణం 2026 ప్రపంచ వాస్తవాలకు సరిపోదు అన్న భావనకు బ్రిక్స్ వేదికపై మరింత బలం వచ్చింది. భద్రతా మండలిలో భారత్ పాత్ర పెరగాలన్న డిమాండ్‌కు చైనా, రష్యా లిఖితపూర్వక మద్దతు ఇవ్వడం ఈ నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యమైన పరిణామం. దశాబ్దాలుగా భారత్ ఒంటరిగా వినిపించిన డిమాండ్ ఇప్పుడు బ్రిక్స్ సభ్యదేశాల ఉమ్మడి ప్రకటనలో భాగమైంది. అదే సమయంలో ఏకపక్ష ఆంక్షలు, వాణిజ్య పరిమితులు, సెకండరీ శాంక్షన్లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక భద్రతను కూడా అజెండాలోకి తీసుకొచ్చింది.

**• డిక్లరేషన్‌లో భారత్ ముద్ర.. ఉగ్రవాదంపై కఠిన స్వరం**

న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో భారత్ కోరుకున్న అనేక అంశాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ తీవ్రంగా ఖండించింది. ఆ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. సరిహద్దులు దాటి జరిగే ఉగ్రవాదం, ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు, ఉగ్ర నిధుల సమకూర్చడం వంటి అంశాలను స్పష్టంగా ప్రస్తావించింది. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదన్న భారత వాదనకు ఇది బలమైన మద్దతు. సమగ్ర అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఒప్పందాన్ని త్వరగా ఆమోదించాలన్న డిమాండ్‌కు కూడా ప్రాధాన్యం లభించింది. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభంపై పౌరుల రక్షణ, మానవతా సహాయం, అంతర్జాతీయ చట్టాల గౌరవం, శాంతియుత పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చింది. బలవంతపు ప్రజా తరలింపును వ్యతిరేకిస్తూ రెండు దేశాల పరిష్కారానికి మద్దతు తెలిపింది. ఉక్రెయిన్ అంశంలో ఏ ఒక్క దేశాన్ని నేరుగా నిందించే భాషను ఉపయోగించకుండా సంభాషణ, దౌత్యం, సంప్రదింపుల ద్వారా పరిష్కారాన్ని కోరింది. ఇదే భారత దౌత్య శైలికి ప్రత్యేకత. వివాదాస్పద అంశాలను పక్కన పెట్టడం కాదు.. అన్ని పక్షాలు అంగీకరించగల భాషలో వాటిని ఉంచడం. ఇరాన్ యూఏఈ వంటి పరస్పర విభేదాలు ఉన్న దేశాలను

**• డాలర్‌కు ప్రత్యామ్నాయం కాదు.. ఆర్థిక స్వావలంబనకు అడుగు**

బ్రిక్స్ చర్చల్లో ఆర్థిక రంగానికి కూడా అత్యంత ప్రాధాన్యం లభించింది. సభ్యదేశాల మధ్య వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన, పారదర్శకమైన సురక్షిత సరిహద్దు చెల్లింపుల వ్యవస్థకు మద్దతు లభించింది. వివిధ దేశాల డిజిటల్ పేమెంట్, మెసేజింగ్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానించే అవకాశాలపై దృష్టి పెట్టింది. సభ్యదేశాల స్వదేశీ కరెన్సీల్లో వాణిజ్య లావాదేవీలు, పెట్టుబడుల సెటిల్‌మెంట్‌కు ప్రోత్సాహం ఇచ్చింది. అయితే బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీకి ఎలాంటి నిర్ణీత గడువు, రోడ్‌మ్యాప్ ప్రకటించలేదు. ఇది భారత వ్యూహంలో ఉన్న వాస్తవికతను చూపిస్తుంది. ఒకే కరెన్సీ కంటే ముందుగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక వ్యవస్థల అనుసంధానం వంటి ఆచరణాత్మక మార్గాలపై దృష్టి పెట్టడం జరిగింది. ప్రపంచ వాణిజ్యంలో సరఫరా గొలుసుల భద్రత, సముద్ర మార్గాల రక్షణ, ఇంధన భద్రత, ఆహార భద్రత కీలక అంశాలుగా మారాయి. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో ఏర్పడుతున్న సంక్షోభాలు ప్రపంచ వాణిజ్యానికి భారీ ఖర్చును మోపుతున్నాయి. సముద్ర మార్గాలు దెబ్బతింటే భారత్ వంటి దిగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థలపై నేర ప్రభావం ఉంటుంది. అందుకే సురక్షిత సముద్ర మార్గాలు, ప్రత్యామ్నాయ రవాణా కారిడార్లు, స్థిరమైన ఇంధన సరఫరా భారత అజెండాలో కీలకంగా మారాయి. బ్రిక్స్ వేదికపై ఎంఎస్ఎంఈలకు ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ అవకాశాలు, స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్, ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ సెక్యూరిటీ, ఫోటోవోల్టాయిక్ రంగంలో సహకారం వంటి అంశాలు ముందుకొచ్చాయి. భారత్ తన డిజిటల్ సామర్థ్యాన్ని కేవలం దేశీయ విజయంగా కాకుండా గ్లోబల్ సౌత్‌కు అందుబాటులో ఉండే మోడల్‌గా చూపించింది. ఐఎంఎఫ్ కోటా సంస్కరణ, ప్రపంచ బ్యాంకులో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యం పెంపు, డబ్ల్యూటీవో అప్పీల్ వ్యవస్థ పునరుద్ధరణ వంటి అంశాలను ముందుకు తీసుకురావడం ద్వారా ప్రపంచ ఆర్థిక పాలనా వ్యవస్థను మార్చే దిశలో భారత్ తన ముద్ర వేసింది.







ఉంచినప్పుడు ఇది చాలా కీలకం. భారత్ బ్రిక్స్‌ను పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకమైన కూటమిగా మార్చే ప్రయత్నం చేయలేదు. "వెస్ట్‌కు వ్యతిరేకం కాదు.. వెస్ట్ వెలుపల ఉన్న శక్తుల సమన్వయం" అనే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లింది. ఇదే విధానం భారత్‌కు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కొనసాగించే అవకాశం ఇస్తోంది. అమెరికా, యూరప్, జపాన్, ఆస్ట్రేలియాతో భాగస్వామ్యాలు కొనసాగిస్తూనే రష్యా, చైనా, ఇరాన్, గ్లోబల్ సౌత్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయగల సామర్థ్యం భారతదేశానికి పెరిగింది. ఒకే శిబిరానికి కట్టుబడి ఉండకుండా.. అవసరానికి అనుగుణంగా వివిధ శక్తులతో పనిచేయగల స్థితి ఇప్పుడు భారతదేశానికి వ్యూహాత్మక బలంగా మారింది.

**• మోదీ-పుతిన్ భేటీ.. సంబంధం నుంచి వ్యూహాత్మక లీవరేజ్**

బ్రిక్స్ సదస్సుతో పాటు ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఢిల్లీలో జరిగిన భేటీ కూడా కీలకమైన దౌత్య పరిణామం. ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన సమావేశానికి కేవలం కొద్ది రోజులకే మరోసారి భేటీ కావడం భారత్ రష్యా సంబంధాల ప్రాధాన్యాన్ని చూపించింది. రాజకీయాలు, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సాంకేతిక రంగం, ప్రజల మధ్య సంబంధాలపై ఇద్దరు నేతలు చర్చించారు. 2030 నాటికి భారత్ రష్యా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యం ఈ సంబంధానికి ఆర్థిక దిశను నిర్దేశిస్తోంది. అయితే వాణిజ్య పరిమాణం పెరగడం మాత్రమే సరిపోదు. భారత ఎగుమతులు పెరగడం, పెట్టుబడులు విస్తరించడం, పారిశ్రామిక సహకారం పెరగడం, సాంకేతిక భాగస్వామ్యాలు బలోపేతం కావడం ద్వారా సంబంధాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరం ఉంది. పుతిన్ బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో మాట్లాడుతూ రష్యాపై ఉన్న భారీ ఆంక్షలను ప్రస్తావించారు. అంతర్జాతీయ రవాణా మార్గాలు, పైప్‌లైన్లు, సముద్ర రవాణా, వాణిజ్యంపై ఆంక్షలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయని రష్యా వాదనను ముందుకు తెచ్చారు. ఆర్కిటిక్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ వంటి మార్గాలపై సహకారాన్ని ప్రస్తావించారు. భారత్‌కు ఇది అత్యంత ఉపయోగకరమైన అంశం. రష్యాతో సంబంధం ఇక కేవలం రక్షణ కొనుగోళ్లు, ఇంధన సరఫరాలకే పరిమితం కాకుండా.. కొత్త వాణిజ్య మార్గాలు, ఇంధన భద్రత, సాంకేతికత, పెట్టుబడులు, సముద్ర భద్రత, పారిశ్రామిక సహకారం వైపు విస్తరించాల్సిన దశ వచ్చింది. నల్ల సముద్రం, పశ్చిమాసియా పరిణామాలు భారత నౌకాయాన రంగంపై చూపుతున్న ప్రభావాన్ని మోదీ పుతిన్‌తో చర్చించారు. భారత నావికుల భద్రతపై కూడా దృష్టి పెట్టారు. యుద్ధాలకు శాశ్వత పరిష్కారం సంభాషణ, దౌత్యం ద్వారానే సాధ్యమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రష్యాతో సంబంధాన్ని కొనసాగించడం అమెరికా లేదా పాశ్చాత్య భాగస్వామ్యాలకు ప్రత్యామ్నాయంగా కాదు. భారత్‌కు మరిన్ని వ్యూహాత్మక ఎంపికలు ఉండేలా చేసే లీవరేజ్‌గా చూడాల్సిన అవసరం ఉంది.

**• చైనా సవాలు.. భారత్‌కు కొత్త వ్యూహాత్మక పరీక్ష**

బ్రిక్స్ భవిష్యత్తులో అత్యంత పెద్ద సవాలు చైనా ప్రభావం. ఆర్థికంగా చైనా భారత్ కంటే బ్రిక్స్‌లో చాలా బలమైన స్థితిలో ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల సహకారం అందించే సామర్థ్యం చైనాకు ఎక్కువ. రష్యాకు బ్రిక్స్ పాశ్చాత్య ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణానికి ఉపయోగపడే వేదిక. ఇలాంటి పరిస్థితుల్లో బ్రిక్స్ పూర్తిగా చైనా లేదా రష్యా ఆధిపత్యంలోకి వెళ్లకుండా చూడడం భారత్‌కు కీలకమైన వ్యూహాత్మక బాధ్యత. చైనాను ఆపడం భారత్ చేతిలో ఉండకపోవచ్చు.. కానీ బ్రిక్స్ ఆలోచనా దిశను ప్రభావితం చేయడం మాత్రం భారత్ చేతిలో ఉంది. న్యూఢిల్లీ సదస్సులో ఇదే ప్రయత్నం స్పష్టమైంది. ఏకపక్ష పోరాటం కంటే సంస్థాగత సంస్కరణలు, అభివృద్ధి, ఆర్థిక సమానత్వం, సాంకేతిక సహకారం, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, సముద్ర భద్రత వంటి అంశాలను ముందుకు తేవడం ద్వారా భారత్ బ్రిక్స్ అజెండాను తనకు అనుకూలంగా మలిచింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఏడేళ్ల తర్వాత భారత్‌కు రావడం, మోదీతో సమావేశం కావడం కూడా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. సరిహద్దులో శాంతి, స్థిరత్వం భారత్‌చైనా సంబంధాలకు పునాది కావాలని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. అదే సమయంలో వాణిజ్య సమస్యలు కూడా చర్చకు వచ్చాయి. 2027లో చైనా బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనుంది. భారత్ ఈ ఏడాది ప్రతిపాదించిన కొన్ని అంశాలను చైనా తన తదుపరి అజెండాలో కొనసాగించనుంది. ఇది భారత దౌత్య ప్రభావానికి ఒక సూచన. బ్రిక్స్ అధ్యక్షత ముగిసినా భారత ఆలోచనలు సంస్థలో కొనసాగడం ప్రధాన విజయంగా చూడాలి. ఈ మొత్తం పరిణామాలను కలిపి చూస్తే భారత్ నాన్ అలైన్‌మెంట్ నుంచి మల్టీఅలైన్‌మెంట్, అక్కడి నుంచి ఆల్‌అలైన్‌మెంట్ దిశగా కదులుతున్న దేశంగా కనిపిస్తోంది. అమెరికాతో భాగస్వామ్యం, రష్యాతో వ్యూహాత్మక సంబంధం, చైనాతో పోటీతో కూడిన సహకారం, యూరప్‌తో ఆర్థిక అనుసంధానం, జపాన్ ఆస్ట్రేలియాతో క్వాడ్, గ్లోబల్ సౌత్‌తో బ్రిక్స్ వేదిక.. ఇవన్నీ ఒకే విదేశాంగ వ్యూహంలోని విభిన్న కోణాలు. భారత్ ఇప్పుడు ఏ ఒక్క శక్తికి అనుసంధానమైన దేశం కాదు; ప్రపంచ శక్తులన్నీ తమ ప్రయోజనాల కోసం భారత్‌తో అనుసంధానం కావాల్సిన స్థాయికి ఎదుగుతోంది. ఇదే న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సు ఇచ్చిన అతిపెద్ద సందేశం. అయితే ముందున్న అసలు పరీక్ష ప్రకటనలను అమల్లోకి తీసుకురావడమే. ట్రోయికా వ్యవస్థ, గ్లోబల్ గవర్నెన్స్ సంస్కరణల రోడ్‌మ్యాప్, సముద్ర నావికుల నెట్‌వర్క్, గ్లోబల్ సౌత్ చర్చలకు మద్దతు వంటి ప్రతిపాదనలకు గడువులు, బాధ్యతలు, ఫలితాలు నిర్ధారించాలి. నమ్మకం పెరిగితేనే విభిన్న ప్రయోజనాలున్న దేశాల సమూహం దీర్ఘకాలిక శక్తిగా మారుతుంది. భారత్ ఆ నమ్మకాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. ఇక ప్రపంచం భారత్‌ను కేవలం ఎదుగుతున్న శక్తిగా చూడటం కాదు.. దిశ చూపగల శక్తిగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రపంచం నిర్ణయించే టేబుల్ వద్ద భారత్ ఒక సీటు కోసం ఎదురుచూసిన కాలం ముగిసింది. ఇప్పుడు ఆ టేబుల్ చుట్టూ కూర్చున్న దేశాలు భారత్ చూపించే దిశను గమనిస్తున్నాయి. ఇదే నాన్‌అలైన్‌మెంట్ నుంచి ఆల్‌అలైన్‌మెంట్ వైపు భారత ప్రయాణానికి అసలైన అర్థం.






# పేమెంట్ పిడుగు?

## యూపీఐపై రుసుముల మోత

- సామాన్యుడి జేబుపై కొత్త భారం
- స్కాన్ చేస్తే చెల్లింపు.. ఇక ఆ రోజులు మారతాయా?

**ఒకప్పుడు జేబులో నగదు లేకపోతే కొనుగోలు ఆగిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జేబులో నగదు లేకపోయినా చేతిలో ఉన్న ఫోనుతో దుకాణం ముందు ఉన్న సంకేతాన్ని చూపిస్తే చెల్లింపు పూర్తవుతోంది. టీకి పది రూపాయలు కావొచ్చు.. కూరగాయలకు ఐదు వందలు కావొచ్చు.. ఆసుపత్రి ఖర్చుకు పదివేలు కావొచ్చు.. యూపీఐతో క్షణాల్లో డబ్బు చేరిపోతోంది. ఇది కేవలం చెల్లింపు పద్ధతి కాదు.. సామాన్యుడు, వ్యాపారి మధ్య ఏర్పడిన కొత్త ఆర్థిక బంధం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్ద వస్త్ర దుకాణం వరకు యూపీఐ సంకేతం కనిపించడం ఇప్పుడు సాధారణ దృశ్యం. చిల్లర కోసం వెతకాల్సిన అవసరం లేదు. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేదు. డబ్బు చేతిలో లేకపోయినా కొనుగోలు చేయవచ్చు. వ్యాపారికి కూడా ప్రయోజనమే. నగదు లెక్కలు చూసుకోవాల్సిన పని తగ్గుతుంది. డబ్బు నేరుగా ఖాతాలోకి వస్తుంది. రోజువారీ వ్యాపారం ఎంత జరిగిందో తెలుసుకోవడం సులభమవుతుంది. ఇలాంటి వ్యవస్థపై ఇప్పుడు రూ.2,000 గీత ఎందుకు వచ్చింది అన్నదే దేశవ్యాప్తంగా చర్చకు కారణమైంది.**



సెప్టెంబర్ 14 సోమవారం రోజున కేంద్రం ఇచ్చిన ప్రకటన ప్రకారం రూ. 2,000 వరకు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థ సంస్థలు నేరుగా గానీ పరోక్షంగా గానీ రుసుము విధించకూడదు. రూపే డెబిట్ కార్డు చెల్లింపులకు కూడా ఇదే రక్షణ ఉంది. కానీ రూ. 2,000కు మించిన వ్యాపారి లావాదేవీలకు భవిష్యత్తులో రుసుము విధించే అవకాశం ఉన్నట్టుగా కొత్త చట్టపరమైన వ్యవస్థ ఏర్పడింది. ఇదే ఇప్పుడు అసలు కలకలం. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన కొన్ని యూపీఐ చెల్లింపులపై ఛార్జీ విధించనున్నారు. అయితే వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే యూపీఐ లావాదేవీలు ఎంత పెద్ద మొత్తంలో ఉన్నా ఉచితంగానే ఉంటాయంటున్నారు. రూ. 2,000 దాటి వ్యాపారి వద్ద చేసే చెల్లింపుపై ఆ వ్యాపారికి 0.4 శాతం ఛార్జీ పడుతుంది. ఒక్క లావాదేవీకి గరిష్ఠంగా రూ. 300గా ఉంటుంది. రైల్వే, టెలికాం సేవలు, బీమా, ఇంధనం వంటి కొన్ని నిర్దిష్ట వ్యాపార విభాగాల్లో రూ. 2,000 కంటే ఎక్కువ యూపీఐ చెల్లింపులకు రూ. 5 ఫ్లాట్ ఛార్జీ విధిస్తారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయమని... యూపీఐ చెల్లింపులు ఉచితమేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చెబుతున్నా.. ఇప్పటికే చాలా మంది నో యూపీఐ.. క్యాష్ ఇవ్వండంటూ అడగటం మొదలు పెట్టేశారు. కొత్త ఛార్జీల భారం వ్యాపారులపైనే అంటున్నా.. ఇదంతా సామాన్యుడిపైనే అంతిమంగా పడుతుందన్నది జగమెరిగిన సత్యం.

### • రూ.2,000 ఎందుకు కీలకమైంది?

ఇక్కడే అసలు విషయం అర్థం చేసుకోవాలి. రూ.2,000 అనేది యూపీఐ ద్వారా చెల్లించగల గరిష్ఠ మొత్తం కాదు. రూ.2,000 దాటితే యూపీఐ పనిచేయదన్న మాట లేదు. రూ.3,000, రూ.5,000, రూ.20,000 కూడా యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. ప్రస్తుతం అలాంటి చెల్లింపుపై వినియోగదారుడి నుంచి కొత్త రుసుము వసూలు చేయడం మొదలు కాలేదు. కేంద్రం ఇచ్చిన తాజా ప్రకటనలో రూ.2,000 వరకు జరిగే యూపీఐ లావాదేవీలకు మాత్రమే ప్రత్యక్ష, పరోక్ష రుసుముల నుంచి స్పష్టమైన రక్షణ ఇచ్చారు. ఇక్కడి నుంచే అనుమానం మొదలవుతోంది. రూ.2,000 వరకు రక్షణ ఉంటే.. దాని పైనున్న మొత్తాలకు అదే రక్షణ ఎందుకు లేదు?




### • రాహుల్ గాంధీ చెబుతున్న 65 శాతం లెక్క ఏమిటి?

ఈ వివాదాన్ని రాజకీయంగా మరింత వేడెక్కించిన అంశం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలు. రూ.2,000కు మించిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై రుసుము విధించే మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం తెరిచిందని ఆయన ఆరోపించారు. ఆయన చెప్పిన లెక్క ప్రకారం రూ.2,000కు మించిన లావాదేవీలు మొత్తం యూపీఐ లావాదేవీల సంఖ్యలో సుమారు 5 శాతం మాత్రమే ఉన్నా, వాటి మొత్తం విలువలో దాదాపు 65 శాతం వాటా ఉంటుందని పేర్కొన్నారు. అంటే సంఖ్య తక్కువగా ఉన్నా పెద్ద మొత్తంలో డబ్బు ఈ లావాదేవీల ద్వారానే కదులుతోందన్నది ఆయన వాదన. అలాంటి లావాదేవీలపై రుసుము వస్తే అది చిన్న మొత్తం కాదని రాహుల్ గాంధీ చెబుతున్నారు. ప్రభుత్వం "వినియోగదారుడిపై రుసుము లేదు" అని చెబుతున్నా, వ్యాపారి చెల్లించే ఖర్చు చివరకు వస్తువుల ధరలో చేరి సామాన్యుడి జేబు నుంచే బయటకు వస్తుందని ఆయన ప్రశ్నిస్తున్నారు. అమెరికా చెల్లింపు సంస్థలు భారతదేశంలోని సున్నా రుసుము విధానాన్ని చాలాకాలంగా వ్యతిరేకిస్తున్నాయని, భారత ప్రభుత్వం ఇప్పుడు ఆ విధానాన్ని మార్చే దిశగా అడుగు వేస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం తలొగ్గుతోందని కూడా తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మరో అడుగు ముందుకేసి.. రూ.2,000 వరకు మాత్రమే స్పష్టమైన రక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో మరింత పెద్ద వర్గాలపై రుసుము విధించే అవకాశం ఏర్పడిందని ఆరోపించారు. ఇక్కడ ఒక విషయాన్ని మాత్రం స్పష్టంగా వేరు చేయాలి. రాహుల్ గాంధీ చేసిన 65 శాతం వ్యాఖ్య రాజకీయ విమర్శలో భాగం. రుసుము విధించడం ద్వారా ఆ 65 శాతం విలువపై తప్పనిసరిగా రుసుము పడుతుందని ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదు. అలాగే అమెరికా ఒత్తిడి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణకు ప్రభుత్వం అంగీకరించిన ఆధారం లేదు. కేంద్రం మాత్రం యూపీఐను సురక్షితంగా, చౌకగా, దీర్ఘకాలం కొనసాగించేందుకు ఆర్థికంగా నిలబడే విధానం అవసరమని చెబుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో స్పష్టం చేసిన ప్రకారం రుసుము వస్తే అది వ్యాపారులపైనే ఉంటుందని, వినియోగదారుడిపై కాదని ప్రభుత్వం చెబుతోంది. అందుకే ప్రజలు రాజకీయ ఆరోపణను ఒకవైపు, అధికారిక నిర్ణయాన్ని మరోవైపు చూసి అర్థం చేసుకోవాలి. అయితే ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్న మాత్రం తేలికగా కొట్టిపారేయలేనిది.. వ్యాపారి ఖర్చు పెరిగితే దాని ప్రభావం ధరలపై పడకుండా ఎలా ఆపుతారు?

ప్రభుత్వం చెబుతున్న సమాధానం ఏమిటంటే.. భవిష్యత్తులో ఎంపిక చేసిన కొన్ని వ్యాపారి లావాదేవీలకు చెల్లింపు నిర్వహణ రుసుము విధించే అవకాశం ఉండాలి. ఆ రుసుము వినియోగదారుడి నుంచి నేరుగా తీసుకోవడం కాదని కేంద్రం చెబుతోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలు ఉచితంగానే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే తండ్రి కొడుకుకు డబ్బు పంపినా, స్నేహితుడు స్నేహితుడికి డబ్బు పంపినా, కుటుంబ సభ్యుడికి డబ్బు బదిలీ చేసినా రుసుము ఉండదని కేంద్రం చెబుతోంది. చర్చ ప్రధానంగా వ్యాపారి వద్ద జరిగే పెద్ద మొత్తాల చెల్లింపులపైనే. ఉదాహరణకు ఒక దుకాణంలో రూ.10,000 విలువైన వస్తువు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా చెల్లిస్తే.. భవిష్యత్తులో ఆ లావాదేవీని నిర్వహించినందుకు వ్యాపారి కొంత రుసుము చెల్లించాల్సి రావచ్చు. ఎంత రుసుము? ఎవరికి చెల్లించాలి? ఏ వ్యాపారికి వర్తించాలి? అన్నది ఇంకా తుది నిర్ణయం కాలేదు. రాయిటర్స్ తాజా నివేదిక ప్రకారం రూ.2,000కు మించిన వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే లావాదేవీలపై దాదాపు 0.4 శాతం వరకు రుసుము విధించబోతున్నారు.

### • వ్యాపారికి రుసుము అంటే.. చివరికి సామాన్యుడికేనా?

ఇదే ఈ మొత్తం వ్యవహారంలో సామాన్యుడికి అత్యంత ముఖ్యమైన ప్రశ్న. ప్రభుత్వం చెప్పేది.. రుసుము ఉంటే అది వ్యాపారి చెల్లిస్తాడని. వినియోగదారుడి ఫోన్‌లో "రుసుము" పేరుతో ప్రత్యేకంగా డబ్బు తీసుకోరని. మాట వినడానికి ఇది సూటిగానే ఉంది. కానీ వ్యాపారి కూడా మనిషే.. అతనికి వచ్చే ఖర్చు చివరకు ఎక్కడి నుంచి వస్తుంది? ఒక చిన్న దుకాణదారుడు రోజుకు వందల యూపీఐ చెల్లింపులు స్వీకరిస్తున్నాడనుకుందాం. ప్రతి చెల్లింపుపై స్వల్ప రుసుము పడితే నెలాఖరుకు అది పెద్ద మొత్తంగా మారొచ్చు. పెద్ద వ్యాపారి ఆ ఖర్చును తన లాభంలో నుంచి భరించగలడు. చిన్న వ్యాపారికి అది అంత సులభం కాదు. అతను ఏం చేస్తాడు? ధర కొద్దిగా పెంచవచ్చు.

నగదు చెల్లిస్తే ఒక ధర.. యూపీఐ చెల్లిస్తే మరో ధర అనే విధానాన్ని కొందరు తీసుకురావచ్చు. లేకపోతే రుసుమును అందరి కొనుగోళ్లలో కలిపేయవచ్చు. అప్పుడు వినియోగదారుడికి యూపీఐ చెల్లించే సమయంలో ఒక్క రూపాయి కూడా అదనంగా కనిపించకపోవచ్చు. కానీ అతను కొనుగోలు చేసే వస్తువు ధర మాత్రం పెరిగి ఉండవచ్చు. ఇదే ప్రతిపక్షం చేస్తున్న ప్రధాన వాదన. వ్యాపారి మీద రుసుము పెడితే అది చివరకు వినియోగదారుడి జేబులోకి వస్తుందని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కేంద్రం మాత్రం వ్యాపారి నుంచి వసూలు చేసే రుసుమును వినియోగదారుడి నుంచి నేరుగా వసూలు చేసినట్టుగా చూడకూడదని చెబుతోంది. ఈ రెండు వాదనల మధ్య నిజం ఎక్కడుందో తేల్చేది రుసుము అమలు విధానమే. రుసుము ఎంత తక్కువగా ఉంటుంది? చిన్న వ్యాపారులను మినహాయిస్తారా? వస్తువుల ధరలు పెంచకుండా నియంత్రణ ఉంటుందా? ఇవే కీలక ప్రశ్నలు. రుసుము చాలా తక్కువగా ఉంటే ప్రభావం పరిమితంగా ఉండవచ్చు. రుసుము ఎక్కువగా ఉంటే వ్యాపారి తన ఖర్చును భర్తీ చేసుకునేందుకు ధరలు పెంచే అవకాశం ఉంటుంది. అప్పుడు సామాన్యుడికి యూపీఐ రుసుము కనిపించదు.. కానీ అతను కొనుగోలు చేసే వస్తువు ధరలో దాని ముద్ర కనిపించవచ్చు. ఇది నేరుగా రుసుము కాదు.. కానీ పరోక్ష భారం అయ్యే అవకాశం. అందుకే ఈ అంశాన్ని కేవలం "రుసుము వినియోగదారుడిపై లేదు" అని ఒక్క మాటతో ముగించడం సరిపోదు.

### • దేశాన్ని కుదిపేసిన నోట్ల రద్దు తర్వాత.. ఇదో కొత్త మలుపా?

యూపీఐ చర్చ కేవలం బ్యాంకులు, వ్యాపారులు, చెల్లింపు సంస్థల వ్యవహారంగా మిగలలేదు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ ఏ దిశగా వెళ్తుందన్న పెద్ద ప్రశ్నగా మారింది. నోట్ల రద్దు సమయంలో నగదు ఆధారిత వ్యవస్థను తగ్గించి డిజిటల్ చెల్లింపులను పెంచాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం బలంగా ముందుకు తెచ్చింది. యూపీఐ ఆ దిశలో దేశానికి పెద్ద మార్పు తీసుకొచ్చింది. ఒక చిన్న దుకాణదారుడికి బ్యాంకు ఖాతా ఉంటే చాలు.. చెల్లింపు సంకేతం పెట్టి డిజిటల్ చెల్లింపులు స్వీకరించే స్థితి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విధానం విస్తరించింది. ఇప్పుడు అదే వ్యవస్థపై పెద్ద మొత్తాల లావాదేవీలకు రుసుము వస్తే ప్రజల ప్రవర్తనలో మార్పు రావచ్చా అన్న ప్రశ్న సహజం. ఒకవైపు ప్రభుత్వం యూపీఐను దేశ సాంకేతిక విజయంగా ప్రపంచానికి చూపిస్తోంది. మరోవైపు అదే వ్యవస్థకు ఆదాయం కావాలంటూ రుసుము విధించే మార్గాన్ని ఎందుకు తెరవాల్సి వచ్చింది? ఇదే ప్రతిపక్షం వేస్తున్న రాజకీయ ప్రశ్న. కేంద్రం ఇచ్చే సమాధానం మాత్రం వేరుగా ఉంది. యూపీఐ ఇప్పుడు కోట్లాది లావాదేవీలను నిర్వహిస్తున్నందున సైబర్ భద్రత, మోసాల నియంత్రణ, సాంకేతిక మౌలిక వసతుల నిర్వహణకు నిరంతర పెట్టుబడులు అవసరమని ప్రభుత్వం చెబుతోంది. కేవలం ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఇంత పెద్ద వ్యవస్థను శాశ్వతంగా నడపడం సాధ్యం కాదని కేంద్రం వాదిస్తోంది. వ్యవస్థలోకి మరిన్ని సంస్థలు రావాలంటే వాటికి ఆదాయ మార్గం ఉండాలని చెబుతోంది. ఈ వాదనలో ఆర్థిక కారణం ఉంది. కానీ ప్రజల ప్రశ్న కూడా అంతే ముఖ్యమైనది... ఇంత భారీ ఆర్థిక వ్యవస్థను నిర్మించిన ప్రభుత్వం, దాని నిర్వహణ ఖర్చును సామాన్యుడిపై పడకుండా చూసే మార్గం ఎందుకు కనుగొనకూడదు? యూపీఐను ప్రజల అలవాటుగా మార్చిన తర్వాత దానిపై ఖర్చు పెడితే ప్రజలు నగదు వైపు మళ్లే ప్రమాదం ఉంది. చిన్న వ్యాపారులు కూడా "నగదే మంచిది" అనే ఆలోచనకు రావచ్చు. అలా జరిగితే డిజిటల్ చెల్లింపుల విస్తరణకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం అలాంటి మార్పు మొదలైందని చెప్పడానికి ఆధారం లేదు. ఇది భవిష్యత్తులో రుసుము ఎలా అమలు చేస్తారనే దానిపై ఆధారపడే అవకాశం ఉన్న పరిణామం.




### • ఇక దేశంలో ఏం మారొచ్చు?

ఇప్పటి వరకు జరిగిన మార్పును ఒక మాటలో చెప్పాలంటే.. యూపీఐకి ఈరోజే రుసుము వచ్చేసింది కాదు; కానీ రుసుము విధించే అవకాశం ఉన్న తలుపు మాత్రం తెరుచుకుంది. ఇదే ఈ మొత్తం వ్యవహారంలో సామాన్యుడు గుర్తుంచుకోవాల్సిన ప్రధాన విషయం. రూ.500 చెల్లించినా, రూ.1,000 చెల్లించినా, రూ.2,000 చెల్లించినా ప్రస్తుతం కొత్త రుసుము లేదు. రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపైనా ప్రస్తుతం వినియోగదారుడి నుంచి కొత్త రుసుము మొదలు కాబోతోంది. రాయిటర్స్ తాజా నివేదిక ప్రకారం చెల్లింపు సంస్థలు, బ్యాంకులు అధిక మొత్తాల వ్యాపారి లావాదేవీలపై రుసుము విధించే విధానంపై రిపోర్ట్ తయారు చేస్తున్నాయి. ఇప్పటికే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 0.4 శాతం వరకు రుసుము నిర్ధారించింది. ఒక అంచనా ప్రకారం ఇలాంటి రుసుముల ద్వారా చెల్లింపు రంగానికి ఏడాదికి రూ.5,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల వరకు ఆదాయం రావచ్చని ఆర్థిక సంస్థ జెఫరీస్ అంచనా వేసింది. ఇక్కడే అసలు ప్రశ్న... ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? వ్యాపారి నుంచి వస్తే వ్యాపారి తన లాభాన్ని తగ్గించుకోవచ్చు. ధర పెంచవచ్చు. నగదు చెల్లింపును ప్రోత్సహించవచ్చు. వినియోగదారుడు నగదుతో చెల్లిస్తే రుసుము తప్పించుకోవచ్చని భావించవచ్చు. అప్పుడు దేశంలో నగదు లావాదేవీలు కొంత పెరగవచ్చు. మరోవైపు యూపీఐ అందించే సౌలభ్యం కారణంగా ప్రజలు పూర్తిగా నగదు వైపు తిరిగి వెళ్లకపోవచ్చు. అసలు మార్పును నిర్ణయించేది రుసుము పరిమాణం, దాని పరిధి, చిన్న వ్యాపారులకు ఇచ్చే మినహాయింపులు, వ్యాపారి ఆ ఖర్చును వినియోగదారుడిపైకి బదిలీ చేస్తున్నాడా లేదా అన్నదే. యూపీఐ వ్యవస్థను నడపడానికి భద్రత, సాంకేతిక మౌలిక వసతులు, మోసాల నియంత్రణకు డబ్బు అవసరం అన్నది వాస్తవం. అదే సమయంలో ప్రజల రోజువారీ చెల్లింపులను ఖరీదైనవిగా మార్చకుండా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉంది. సామాన్యుడి ప్రశ్న చాలా సూటిగా ఉంది... దేశంలో కోట్లాది ప్రజలను నగదు నుంచి డిజిటల్ చెల్లింపుల వైపు తీసుకొచ్చిన వ్యవస్థకు ఖర్చు ఉంటే దాన్ని భరించే మార్గం ప్రభుత్వం ఎందుకు కనుగొనకూడదు? ఈ ప్రశ్నకు రాబోయే విధానం సమాధానం చెప్పాలి. ఎందుకంటే యూపీఐ కేవలం ఫోన్‌లో కనిపించే సంకేతం కాదు. అది ఒక రైతు, ఒక కూలీ, ఒక ఉద్యోగి, ఒక చిన్న వ్యాపారి, ఒక వినియోగదారుడి రోజువారీ జీవితంలో భాగమైపోయింది. ఆ బంధంలో రుసుము అనే చిన్న మార్పు కూడా దేశ ఆర్థిక ప్రవర్తనలో పెద్ద మార్పుకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు దేశం ఎదురు చూస్తున్నది "యూపీఐకి రుసుము వస్తుందా?" అన్న ఒక్క ప్రశ్నకే కాదు.. "వస్తే ఆ భారం ఎవరి మీద పడుతుంది?" అన్న అసలు ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చే సమాధానంపైనే.



ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో నిర్ణయాన్ని విడిగా చూస్తే సాధారణ పరిపాలనా చర్యగానే కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించాలనుకోవడం పరిపాలనా అవసరంలా, నీటి ప్రాజెక్టుల ప్రారంభం అభివృద్ధి కార్యక్రమంలా, ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, 12వ పీఆర్సీకి కదలిక ఉద్యోగుల సమస్యల పరిష్కారంలా కనిపిస్తున్నాయి. అర్హులకు ఎన్టీఆర్ భరోసా కింద కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ, రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లకు డియర్‌నెస్ రిలీఫ్ పెంపు, వృద్ధ పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పునరుద్ధరణ కూడా సంక్షేమ నిర్ణయాలుగానే కనిపిస్తాయి. కానీ వీటన్నింటినీ ఒకే రాజకీయ ఫ్రేమ్‌లో చూస్తే మరో కోణం కనిపిస్తుంది. ఎన్నికల వేడి, కరువు పరిస్థితులు, నీటి ప్రాజెక్టుల హడావుడి, ఉద్యోగులు, పెన్షనర్లకు వరుస ప్రయోజనాలు, కొత్త పెన్షన్లకు దరఖాస్తులు, పండుగల సీజన్ ఒకేసారి రావడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి 2026లో మరో కీలక పరీక్షకు సిద్ధమవుతోందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. స్థానిక ఎన్నికలను అక్టోబర్ చివరినాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ వైఖరిని అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఎన్నికలను వాయిదా వేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అయితే ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు, న్యాయపరమైన అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కాబట్టి అక్టోబర్ గడువు ప్రభుత్వ లక్ష్యమే అయినా, తుది షెడ్యూల్ న్యాయపరమైన పరిణామాలపై ఆధారపడుతుంది. అయినా ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా క్యాలెండర్‌ను ఇప్పటికే ఎన్నికల చుట్టూ కేంద్రీకరించినట్టే కనిపిస్తోంది.

## ఇంటర్వెల్ దాకా ఓకే

# అసలు ఆట ఇప్పుడే మొదలు..

### ప్రాజెక్టు జలపాతాలు... ఉద్యోగులకు వరాలు..

### కొత్త పెన్షన్ల ఆదేశాలు... కూటమి 'క్లీన్‌స్వీప్' లెక్కలు

### జెంటిల్‌మెన్ అలియాస్ వాటర్‌మెన్ లోకల్ స్కెచ్ ఇదేనా..!

**ఎన్నికలు ఎందుకు ఇంత త్వరగా.. అసలు లెక్క ఇదే!**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి పరిపాలనా కారణాలు ఉన్నాయి. అనేక మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల పదవీకాలాలు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు లేకపోవడం ప్రజాస్వామ్య స్థానిక పాలనపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. మరోవైపు స్థానిక సంస్థలకు వచ్చే కేంద్ర ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ ఎన్నికలకు ప్రాధాన్యం ఉంది. ఆరు నెలలకు మించి ఎన్నికలు జరగకపోతే నిధులపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం చెబుతోంది. అయితే పరిపాలనా కారణాలతో తీసుకున్న నిర్ణయానికి రాజకీయ ప్రయోజనం ఉండకపోవడం వేరు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 స్థానాలు గెలుచుకుని కూటమి 164 సీట్లతో అధికారంలోకి వచ్చింది. వైసీపీ 11 స్థానాలకే పరిమితమైంది. ఈ భారీ విజయం కూటమికి బలమైన రాజకీయ మూలధనాన్ని ఇచ్చింది. ఇప్పుడు రెండున్నరేళ్ల తర్వాత జరిగే స్థానిక ఎన్నికలు ఆ బలానికి రీటెస్ట్‌గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి అంశాలు, నాయకత్వం, సంక్షేమం, కూటమి సమీకరణాలు ప్రభావం చూపితే.. స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత సంబంధాలు, కుల, వర్గ సమీకరణాలు, అభ్యర్థి బలం, స్థానిక సమస్యలు, నాయకుల మధ్య విభేదాలు కీలకంగా మారతాయి. అందుకే అసెంబ్లీ విజయాన్ని గ్రామ స్థాయిలో పునరావృతం చేయడం కూటమికి అంత సులభం కాదు. స్థానిక ఎన్నికల ఫలితాలు 2024 తీర్పు ప్రభావం ఇంకా కొనసాగుతోందా, లేక నేలస్థాయిలో కొత్త రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయా అన్నది స్పష్టం చేయనున్నాయి.

**కూటమికి 'క్లీన్‌స్వీప్' టార్గెట్.. వైసీపీకి రీటెస్ట్!**

స్థానిక ఎన్నికలపై కూటమి వ్యూహం వేగంగా మారుతోంది. నియోజకవర్గాల వారీ సమీక్షలు, మండల స్థాయి సమన్వయం, వార్డు స్థాయి కేడర్ సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సర్దుబాట్లపై దృష్టి పెట్టింది. 2024లో వచ్చిన తీర్పు అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాలేదని గ్రామం నుంచి పట్టణం వరకు నిరూపించుకోవడమే కూటమి లక్ష్యంగా కనిపిస్తోంది. అందుకే 'క్లీన్‌స్వీప్'పై శిబిరంలో ప్రత్యేక దృష్టి ఉంది. మరోవైపు 2021లో స్థానిక ఎన్నికల్లో ఆధిపత్యం చూపిన వైసీపీకి ఇప్పుడు తన కేడర్ బలం, స్థానిక నాయకత్వాన్ని పరీక్షించుకునే అవకాశం వచ్చింది. వైసీపీ అనూహ్యంగా మెరుగైన ఫలితాలు సాధిస్తే కూటమిపై అసంతృప్తి మొదలైందనే రాజకీయ కథనానికి బలం చేకూరుతుంది. ఇదే సమయంలో రాష్ట్రంలో వర్షాభావం రైతు సమస్యలను పెంచుతోంది. జూన్‌ఆగస్టు మధ్య వర్షపాతం లోటు సాగుపై ప్రభావం చూపడంతో పలు ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఎల్‌నినో ప్రభావంపై నిపుణుల హెచ్చరికలు ఉన్నప్పటికీ, వర్షాభావానికి అదే ఒక్క కారణమని చెప్పలేం. అయితే రైతు ఇబ్బందులు పెరిగితే దాని రాజకీయ ప్రభావం అధికారపక్షం పైనే పడుతుంది. అందుకే వర్షాభావ సమయంలో నీటి ప్రాజెక్టులు ప్రభుత్వానికి అభివృద్ధి అంశంతో పాటు రాజకీయంగా కీలకంగా మారాయి. ఆగస్టు 31న సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి 10.70 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు నాలుగు లక్షల మందికి తాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ప్రాజెక్టుల ప్రచారం కంటే నీరు రైతు పొలానికి చేరి పంటకు ఉపయోగపడితేనే రాజకీయంగా శాశ్వత ఫలితం ఉంటుంది. స్థానిక ఎన్నికల్లో ప్రజల తీర్పు కూటమి బలాన్ని మాత్రమే కాదు, వైసీపీ పునరాగమన అవకాశాలను కూడా స్పష్టం చేయనుంది. అందుకే ఈ ఎన్నికలు రెండు పార్టీలకు కీలకమైన రీటెస్ట్‌గా మారాయి. ఫలితాలే 2029 రాజకీయ కథనానికి తొలి పెద్ద సంకేతంగా నిలవనున్నాయి.

**నీటి రాజకీయంతో ఉద్యోగుల వరాల దాకా..!**

నీటి రాజకీయంతో ఉద్యోగుల వరాల దాకా..! రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లో నీరు కేవలం అభివృద్ధి అంశం కాదు.. రాజకీయ భావోద్వేగం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కావడంతో ప్రభుత్వం సహజంగానే క్రెడిట్ తీసుకుంటోంది. రైతు పొలానికి నీరు చేరి పంట పండితేనే ఈ ప్రచారానికి శాశ్వత రాజకీయ ఫలితం ఉంటుంది. మరోవైపు పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించే కార్యక్రమం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. రాయలసీమకు కృష్ణా జలాలు, ఉత్తరాంధ్రకు గోదావరి నీరు, కోస్తాకు సాగునీరు అందించే ప్రయత్నాలు కూటమి అభివృద్ధి కథనానికి బలం చేకూర్చే అంశాలుగా మారాయి. అయితే కాలువల్లో నీరు కనిపించడం కంటే రైతు ఆదాయం పెరగడం, పంటకు గిట్టుబాటు ధర రావడమే కీలకం. ఇదే సమయంలో ఉద్యోగుల పెండింగ్ డీఏలు, బకాయిలు, 12వ పీఆర్సీపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూలై, 2025 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను అక్టోబర్ 2026 జీతంతో చెల్లించేందుకు అంగీకరించింది. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్‌ను 2027 జనవరి నుంచి పునరుద్ధరించనుంది. ఈ నిర్ణయాలతో ఏడాదికి రూ.2,880 కోట్ల అదనపు భారం పడుతుందని ప్రభుత్వం చెబుతోంది. సెప్టెంబర్ ప్రకటనలు, అక్టోబర్ డీఏ చెల్లింపులు, స్థానిక ఎన్నికలు, పండుగల సీజన్ ఒకేసారి రావడం రాజకీయంగా ఆసక్తికరంగా కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఎన్నికల కోసమేనని చెప్పేందుకు ఆధారాలు లేవు. పరిపాలనా అవసరం, ఉద్యోగుల ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు కూడా కారణాలే. గత రెండేళ్లలో రూ.30,849 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించినట్లు ప్రభుత్వం చెబుతున్నా, పీఆర్సీ అమలు, మిగిలిన బకాయిలపై ఉద్యోగుల్లో ఇంకా ప్రశ్నలున్నాయి.

**కూటమి లెక్కలు.. వైసీపీతో చిక్కులు!**

స్థానిక ఎన్నికలను త్వరగా నిర్వహించాలన్న పట్టుదల, నీటి ప్రాజెక్టుల ప్రారంభాలు, వర్షాభావ సమయంలో సాగునీటి ప్రచారం, ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీకి కదలిక, వృద్ధ పింఛనుదారులకు అదనపు పెన్షన్, పండుగల ముందు ఆర్థిక ప్రయోజనాలు.. ఇవన్నీ కలిపి రాష్ట్రంలో ప్రత్యేక రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వీటిని పూర్తిగా ఎన్నికల కోసమేనని చెప్పడం ఎంత తొందరో, రాజకీయ ప్రభావం లేదనడం కూడా అంతే తప్పు. ప్రభుత్వ నిర్ణయాలకు రాజకీయ ప్రభావం సహజం. ఇప్పుడు కూటమి ముందున్న అసలు ప్రశ్న వైసీపీ బలం కాదు.. తమపై వ్యతిరేకత ఎంత వేగంగా పెరుగుతుందన్నదే. 2024లో భారీ విజయం సాధించిన కూటమికి స్థానిక ఎన్నికలు తొలి పెద్ద పరీక్ష. క్లీన్‌స్వీప్ వస్తే 2024 తీర్పు ఇంకా కొనసాగుతోందని, గ్రామస్థాయి వరకు కూటమి బలం నిలిచిందని చెప్పుకునే అవకాశం ఉంటుంది. 2029 ఎన్నికలకు అది కేడర్‌కు భారీ మానసిక బలాన్నిస్తుంది. మరోవైపు వైసీపీ కీలక ప్రాంతాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తే జగన్‌కు పునరాగమన కథనం లభిస్తుంది. కూటమి ఓట్లలో చీలిక, టీడీపీజనసేన సమన్వయ లోపాలు, స్థానిక అసంతృప్తి బయటపడతాయి. పండుగలు, ప్రభుత్వ ప్రకటనలు ప్రభావం చూపినా స్థానికంగా అభ్యర్థి, వ్యక్తిగత సంబంధాలు, కుల సమీకరణాలు, స్థానిక సమస్యలే కీలకం. అందుకే కూటమి ప్రకటనలను ప్రజల అనుభవంగా మార్చాలి. నీరు రైతు పొలానికి చేరాలి, డీఏ సమయానికి రావాలి, పీఆర్సీ అమలవాలి, పింఛన్ ప్రయోజనాలు అందాలి. అప్పుడే అభివృద్ధి కథనం ఓటుగా మారుతుంది. లేకపోతే ప్రారంభోత్సవాలు, హామీలు కొంతకాలం మాత్రమే పనిచేస్తాయి. చివరికి ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలను తమ జీవితాల్లో వచ్చిన మార్పుతోనే కొలుస్తారు. అదే స్థానిక ఎన్నికల అసలు పరీక్షగా మారనుంది. ఫలితం ఏకపక్షంగా ఉంటే కూటమి దూకుడు పెరుగుతుంది; పోటీ గట్టిగా ఉంటే ప్రతిపక్షానికి కొత్త ఊపొస్తుంది. అక్టోబర్ స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమి బలాన్నే కాదు, వైసీపీ పునరాగమన అవకాశాలను కూడా నిర్దేశిస్తూ 2029 రాజకీయ కథకు తొలి సంకేతంగా నిలవనున్నాయి.

**ఇంటర్వెల్ తర్వాత అసలు ఆట మొదలు..!**

వైసీపీ కేవలం ప్రభుత్వాన్ని విమర్శిస్తే తిరిగి పుంజుకోవడం సాధ్యం కాదు. స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టడం, కేడర్‌ను కదిలించడం, గ్రామస్థాయిలోని అసంతృప్తిని ఓటుగా మలచడం, 2024 తర్వాత ఏర్పడిన సంస్థాగత బలహీనతలను అధిగమించడం ఆ పార్టీకి కీలకం. అలా చేస్తే స్థానిక ఎన్నికలు జగన్‌కు రాజకీయ ఆక్సిజన్‌గా మారతాయి. లేకపోతే వైసీపీ ఇంకా కోలుకోలేదనే ముద్ర బలపడుతుంది. మరోవైపు 2024లో అధికారంలోకి వచ్చిన కూటమికి రెండేళ్ల పాలన తర్వాత జరుగుతున్న స్థానిక ఎన్నికలు కీలక పరీక్ష. ప్రభుత్వం స్థానిక ఎన్నికలు, నీటి ప్రాజెక్టులు, ఉద్యోగుల ప్రయోజనాలు, పింఛన్లు, అభివృద్ధి కార్యక్రమాలతో తన అనుకూల వాతావరణాన్ని బలపరచుకునే ప్రయత్నం చేస్తోంది. అక్టోబర్ స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ సాధిస్తే 2024 తీర్పు కొనసాగుతోందనే సందేశాన్ని ఇచ్చి 2029కు బలమైన పునాది వేసుకోవచ్చు. వైసీపీ అనూహ్యంగా పుంజుకుంటే మాత్రం రాజకీయ కథనం మారుతుంది. కూటమి ఓట్లలో చీలిక, టీడీపీజనసేన సమన్వయ లోపాలు, స్థానిక నాయకుల అసంతృప్తి, సామాజిక సమీకరణాలు వెలుగులోకి వస్తాయి. జనసేన బలం పెరిగినా కూటమి అంతర్గత సమీకరణాలు మారే అవకాశం ఉంది. అందుకే ఇవి కేవలం స్థానిక ఎన్నికలు కావు.. 2024 తీర్పుకు రీటెస్ట్. ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలకే కాదు, ఎన్నికల తర్వాతి రెండున్నరేళ్ల రాజకీయ వాతావరణానికి కూడా సిద్ధమవుతోంది. కూటమి బలం చూపిస్తే పాలనకు ఊతం లభిస్తుంది. ఎదురుదెబ్బ తగిలితే ప్రతిపక్షానికి కొత్త ఊపు వస్తుంది. చివరికి ప్రకటనలు, హామీలు కాదు.. ప్రజల అనుభవమే ఓటుగా మారుతుంది. అందుకే ఇంటర్వెల్ వరకు కథ కూటమి చేతిలో ఉన్నట్టే కనిపించినా.. క్లైమాక్స్ మాత్రం ఓటరు చేతిలో ఉంది. అక్టోబర్ ఫలితాలే 2029 రాజకీయ కథకు తొలి పెద్ద క్లూగా నిలవనున్నాయి.

# భారత్‌తో బంధంపై ఢాకా కొత్త వ్యూహం

■ **రెహ్మాన్ పర్యటనపై ఇంకా అస్పష్టత**

బంగ్లాదేశ్‌కు అత్యంత కీలక పొరుగు దేశాల్లో భారత్ ఒకటి. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆహ్వానం అందినా ఆయన ఆ దేశ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ భారత్‌లో పర్యటించలేదు. ఐతే, సెప్టెంబర్ 21న న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే ముందు భారత్ పర్యటన జరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మాట్లాడుతూ, రెహ్మాన్‌కు భారత్ రెండు ఆహ్వానాలు పంపిందని తెలిపారు. ఒకటి ద్వైపాక్షిక పర్యటనకు, మరోటి బిమ్‌స్టెక్ అధ్యక్ష హోదాలో బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యేందుకు ఇచ్చిన ఆహ్వానం. అయితే ఢాకా నుంచి ఇప్పటి వరకు తుది స్పందన రాలేదన్నారు.

**ముందు ద్వైపాక్షిక భేటీకే ప్రాధాన్యం**

బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ మాత్రం సరైన సమయం కుదిరినప్పుడు భారత్ పర్యటన జరుగుతుందని స్పష్టం చేశారు. భారత్‌తో సంబంధాలను కొత్తగా పునర్నిర్మించుకోవాలని ఢాకా భావిస్తోందని, అందుకు ముందుగా ద్వైపాక్షిక పర్యటన అవసరమని తెలిపారు. బహుపాక్షిక వేదిక ద్వారా భారత్‌ను సందర్శించడం కంటే ద్వైపాక్షిక చర్చలే మెరుగైన మార్గమని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో ఏర్పడిన సంబంధాలను పునఃసమీక్షించి, కొత్త కార్యాచరణ సంబంధాన్ని నెలకొల్పాలని బంగ్లాదేశ్ కోరుకుంటోందన్నారు. యూఎన్ సమావేశాల సందర్భంగా ప్రపంచ నేతలతో రెహ్మాన్ భేటీలు చివరి నిమిషంలో ఖరారయ్యే అవకాశం ఉందన్నారు.



**యూఎన్ వేదికగా కొత్త దిశ**

న్యూయార్క్ పర్యటనలో రెహ్మాన్ బంగ్లాదేశ్ భవిష్యత్ దిశ, కొత్త దృక్పథాన్ని ప్రపంచ నేతల ముందు వివరించనున్నారు. రోహింగ్యా శరణార్థుల సంక్షోభంపై ప్రత్యేక ఉన్నతస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించనున్నారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహ్మాన్ యూఎన్ జనరల్ అసెంబ్లీ 81వ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. సెప్టెంబర్ 8న సమావేశాలను ప్రారంభించిన ఆయన, "అందరి కోసం పనిచేసే ఐక్యరాజ్యసమితిపై నమ్మకాన్ని పునరుద్ధరించడం" అనే ప్రధాన ఇతివృత్తంతో సభను నడిపిస్తున్నారు. 193 సభ్యదేశాలకు సమాన ఓటు హక్కు ఉన్న ఈ వేదికలో రెహ్మాన్ ప్రసంగం కీలకంగా మారనుంది.

# డాలర్ వరద.. రూపాయికి సంకటం

■ **ఫారెక్స్ బలంతో ఇండియాకు సమస్య**



భారత బ్యాంకింగ్ వ్యవస్థలోకి విదేశీ కరెన్సీ డిపాజిట్లు భారీగా రావడం తొలుత విధానపరమైన విజయంగా కనిపించింది. బ్యాంకులు విదేశీ డిపాజిట్ల ద్వారా సుమారు 128 బిలియన్ డాలర్లు సమీకరించాయి. వాటిలో పెద్ద భాగాన్ని ఆర్‌బీఐకి రూపాయల కోసం స్వాప్ చేశాయి. దీంతో దేశ విదేశీ మారక నిల్వలకు బలం చేకూరింది. అయితే డాలర్లకు బదులుగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చిన రూపాయలు ఇప్పుడు అదనపు ద్రవ్య లభ్యతగా మారాయి.

**రూ.15 లక్షల కోట్ల మిగులు**

ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.14-15 లక్షల కోట్ల మేర మిగులు లిక్విడిటీ ఉన్నట్లు అంచనా. దీని ప్రభావం మనీ మార్కెట్లపై స్పష్టంగా పడుతోంది. మిగులు నిధులను సమీకరించేందుకు ఆర్‌బీఐ 30 రోజుల వీఆర్‌ఆర్‌ఆర్ ద్వారా రూ.7 లక్షల కోట్లు తీసుకునే ప్రయత్నం చేసినా, బ్యాంకుల నుంచి కేవలం రూ.2.59 లక్షల కోట్ల బిడ్లు మాత్రమే వచ్చాయి. భవిష్యత్ వడ్డీ రేట్లు, నగదు అవసరాలపై అనిశ్చితి కారణంగా బ్యాంకులు భారీ మొత్తాలను ఒకేసారి లాక్ చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

**ఆర్‌బీఐ ముందున్న మార్గాలు**

ద్రవ్య మిగులును తగ్గించేందుకు ఆర్‌బీఐ డాలర్‌రూపాయి సెల్ బై స్వాప్‌లు ఉపయోగిస్తోంది. వీటి ద్వారా డాలర్లు విక్రయించి రూపాయలను తాత్కాలికంగా ఉపసంహరించుకోవచ్చు. బాండ్లను పెద్ద ఎత్తున విక్రయించాల్సిన అవసరం లేకపోవడంతో ప్రభుత్వ రుణాలపై తక్షణ ఒత్తిడి తగ్గుతుంది. మరోవైపు సీఆర్‌ఆర్ పెంపు, ఓపెన్ మార్కెట్ సేల్స్, మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్, వీఆర్‌ఆర్‌ఆర్ వంటి మార్గాలు కూడా ఉన్నాయి. అయితే ప్రతి మార్గానికీ బ్యాంకులు, ప్రభుత్వం, ఆర్‌బీఐపై భిన్నమైన ఆర్థిక వ్యయం ఉంటుంది.

**డాలర్ విజయానికి రూపాయి మూల్యం**

రూ.14-15 లక్షల కోట్ల మిగులు దీర్ఘకాలం కొనసాగితే మనీ మార్కెట్ రేట్లు దిగువకు చేరి ద్రవ్య విధాన ప్రభావం బలహీనపడే ప్రమాదం ఉంది. అదనపు నగదు రుణాలు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఆస్తి మార్కెట్ల వైపు మళ్లే అవకాశం కూడా ఉంటుంది. ప్రతి అదనపు రూపాయి నేరుగా ద్రవ్యోల్బణానికి దారితీయకపోయినా, ఆర్‌బీఐ ఎంత మిగులు లిక్విడిటీని అంగీకరిస్తుందన్నది కీలకం. విదేశీ మారక స్థితిని బలోపేతం చేసిన డిపాజిట్లు దేశానికి లాభమే. అయితే వాటి ప్రతిఫలంగా ఏర్పడిన రూపాయి మిగులు ఇప్పుడు ఆర్‌బీఐకి కొత్త సవాల్‌గా మారింది.



# ఇమ్రాన్ కోసం సీస్ దిగ్గజాల గళం

పాకిస్థాన్ మాజీ కెప్టెన్, 1992 ప్రపంచకప్ విజేత ఇమ్రాన్ ఖాన్ జైలు నిర్బంధంపై ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజాలు గళమెత్తారు. ఏడుగురు మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్లు తమ ప్రభుత్వాన్ని జోక్యం చేసుకోవాలని కోరుతూ విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌కు లేఖ రాశారు. అలన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, కిమ్ హ్యూస్, మార్క్ టేలర్, స్టీవ్ వా సంతకాలు చేసిన ఈ లేఖలో ఇమ్రాన్‌కు అడయాలా జైలులో అందుతున్న వైద్య సదుపాయాలు, కుటుంబ సభ్యుల కలయిక, న్యాయ సహాయం వంటి అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఇమ్రాన్‌పై ఉన్న చట్టపరమైన, రాజకీయ కేసుల్లో తాము ఎలాంటి వైఖరి తీసుకోవడం లేదని స్పష్టం చేసిన దిగ్గజాలు.. జైల్లో ఉన్న వ్యక్తికి మానవీయంగా వ్యవహరించడం ప్రాథమిక మానవత్వమని పేర్కొన్నారు. ఇమ్రాన్ కుమారులు ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. 2022లో ఇమ్రాన్‌ను కలిసిన గ్రెగ్ చాపెల్.. అప్పట్లో ఆయన ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నారని గుర్తుచేశారు. "ఆయన జైలులోనే చనిపోతారేమోనని ఆందోళనగా ఉంది" అంటూ చాపెల్ ఆవేదన వ్యక్తం చేశారు.

# బ్యాట్ నుంచి షాట్‌గన్ వరకు



కప్పుడు చేతిలో బ్యాట్.. ఇప్పుడు గురిపెట్టిన షాట్‌గన్.. ఇదే మైరాజ్ అహ్మద్ ఖాన్ అసాధారణ క్రీడా ప్రయాణం. ఉత్తరప్రదేశ్‌లోని ఖుర్జా నుంచి ప్రపంచ షూటింగ్ రేంజ్‌ల వరకు సాగిన ఈ 50 ఏళ్ల యోధుడి కథలో పట్టుదలే అసలైన విజేత. 1994లో క్రికెట్‌తో మొదలైన ప్రయాణంలో మైరాజ్ యూపీ తరఫున సీకే నాయుడు, వినూ మంకడ్ ట్రోఫీల్లో ఆడాడు. జామియా మిలియా ఇస్లామియాలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఆడుతున్న సమయంలో యువ వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి నెట్స్ పంచుకున్నాడు. అయితే విధి అతడిని మరో క్రీడ వైపు నడిపించింది. చిన్నతనంలో షూటింగ్‌పై ఆసక్తి ఉన్న మైరాజ్.. ఒక జిల్లా స్థాయి పోటీలో గెలిచిన రూ.30తో క్రికెట్ బ్యాట్ కొనుక్కున్నాడు. 1999లో చెన్నైలో రోంజన్ సోధితో జరిగిన స్కీట్ షూట్ ఆఫ్‌లో విజయం అతడి జీవితాన్ని మలుపుతిప్పింది. అప్పటి నుంచి స్కీట్‌నే శ్వాసగా మార్చుకున్న మైరాజ్ 2016 రియో ఒలింపిక్స్‌కు షాట్‌గన్ స్కీట్‌లో అర్హత సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. రెండు ఒలింపిక్స్, ప్రపంచకప్‌లో స్వర్ణం, రజతం అతడి ఖాతాలో చేరాయి. 2018, 2022 ఆసియా క్రీడల బెర్త్‌లు తృటిలో చేజారినా ఇప్పుడు నాలుగో ఆసియా క్రీడలకు సిద్ధమయ్యాడు. "50 కొత్త 20.. అతనికి జోష్ ఉంటే, నాకు హోష్ ఉంది" అంటూ యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి చెప్పిన మైరాజ్.. అనుభవానికి వయసు అడ్డుకాదని మరోసారి నిరూపించేందుకు గురిపెట్టాడు.

# వెస్టిండీస్‌తో వన్డేలకు ఎవరు?



వెస్టిండీస్‌తో జరగనున్న మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌కు భారత జట్టు ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశం కానుండగా, అందరి దృష్టి రిషభ్ పంత్ పునరాగమనంపై, హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్‌పై ఉంది. సెప్టెంబర్ 27 నుంచి వన్డేలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాండ్యా 10 ఓవర్లు బౌలింగ్ చేసి, 50 ఓవర్లు ఫీల్డింగ్ చేయగలడా అన్నదే కీలకం. పాండ్యా అందుబాటులో లేకపోతే సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత సెలెక్టర్లకు తలనొప్పిగా మారనుంది. ఇషాన్ కిషన్ ఆసియా క్రీడల్లో ఉండటంతో పంత్‌కు 15 మంది జట్టులో అవకాశం దక్కొచ్చని సమాచారం. కేఎల్ రాహుల్ తొలి వికెట్ కీపర్‌గా, శుభ్‌మన్ గిల్‌కు డిప్యూటీగా కనిపిస్తున్నాడు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ నాలుగో స్థానంలో బరిలోకి దిగే అవకాశముంది. రజత్ పాటిదార్ మిడిలార్డర్ బ్యాకప్‌గా ఉండొచ్చు. రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి వచ్చే అవకాశమూ ఉంది. ఇంగ్లాండ్ వన్డేలకు దూరమైన మహ్మద్ సిరాజ్ తిరిగి పేస్ దళంలో చేరనున్నాడు. బుమ్రా ఆసియా క్రీడల కారణంగా అందుబాటులో ఉండడు. Shami, Chahalకు మాత్రం ప్రస్తుతానికి చోటు దక్కే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.

# సంజూ సునామీ.. సిరీస్ భారత్‌దే

ఢిల్లీలో జరిగిన రెండో టీ20లో సంజూ శాంసన్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్థాన్‌పై ఘన విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ, అభిషేక్ శర్మ విధ్వంసక బ్యాటింగ్‌తో అదిరిపోయే ఆరంభం అందించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులతో సంజూ బౌండరీల మోత మోగించగా, అభిషేక్ శర్మ 19 బంతుల్లో 39 పరుగులతో మెరుపులు మెరిపించాడు. ఇద్దరూ కలిసి 88 పరుగుల కీలక భాగస్వామ్యంతో విజయానికి బలమైన పునాది వేశారు. దీంతో లక్ష్యఛేదన భారత్‌కు సునాయాసంగా మారింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్థాన్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. నితీశ్ రెడ్డి కెరీర్‌లోనే అత్యుత్తమంగా మూడు వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ బ్యాటింగ్ వెన్నువిరిచాడు. పేసర్ అర్షదీ...



## టాస్ కింగ్ శ్రేయస్ అయ్యర్

న్యూఢిల్లీలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన రెండో టీ20లో టాస్ గెలిచిన శ్రేయస్ అయ్యర్.. భారత కెప్టెన్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో టాస్ గెలవడంతో తొలి 12 టీ20ల్లో 11 టాస్‌లు గెలిచిన కెప్టెన్‌గా అయ్యర్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఖతార్ కెప్టెన్ మిర్జా బేగ్, ఫిలిప్పీన్స్ కెప్టెన్ హెన్రీ టైలర్ పేరిట ఉన్న 10 టాస్‌ల రికార్డును అధిగమించాడు.



# ఎం.ఎస్. సుబ్బులక్ష్మిగా రష్మిక

## బయోపిక్‌కు భారీ ఆరంభం!

భారతీయ సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిన దిగ్గజ గాయని ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితకథ ఇప్పుడు వెండితెరపైకి రాబోతోంది. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌లో సుబ్బులక్ష్మి పాత్రను నటి రష్మిక మందన్న పోషించనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. 'జెర్సీ', 'మళ్లీ రావా' చిత్రాలతో తనదైన ముద్ర వేసిన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. సినిమాకు సంబంధించిన అధికారిక లాంచ్ వేడుక రేపు చెన్నైలో ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ఉలగనాయగన్ కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పూజా కార్యక్రమంతో పాటు అదే వేదికపై బయోపిక్ ఫస్ట్‌లుక్, టైటిల్‌ను కూడా ఆవిష్కరించేందుకు మేకర్స్ భారీగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ రెండు కీలక అప్‌డేట్స్ రేపు సాయంత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. సంగీత ప్రపంచానికి చెందిన ఓ మహోన్నత వ్యక్తిత్వాన్ని తెరకెక్కించనున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గీతా ఆర్ట్స్, రాక్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై అల్లు అరవింద్, బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనున్నారు. రష్మిక పాత్ర ఎలా ఉండబోతోంది? గౌతమ్ తిన్ననూరి ఈ సంగీత దిగ్గజం జీవితాన్ని ఎలా ఆవిష్కరించబోతున్నారు? అన్న ఆసక్తి రేపటి టైటిల్, ఫస్ట్‌లుక్‌తో మరింత పెరగనుంది.



# 'ది ప్యారడైజ్' సాంగ్.. 100 మిలియన్ రికార్డ్!

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే రికార్డుల వేట మొదలుపెట్టింది. సెప్టెంబర్ 24, 2026న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఆగస్టు 29న విడుదలైన రెండో సింగిల్ 'యశనగుల' సంచలన విజయాన్ని అందుకుంది. నాని, కీర్తి సురేష్ కలయికలో తెరకెక్కిన ఈ జానపద గీతం విడుదలైన కేవలం 17 రోజుల్లోనే ఒకే భాషలో 100 మిలియన్ వ్యూస్ సాధించి.. ఈ మైలురాయిని అత్యంత వేగంగా చేరుకున్న టాలీవుడ్ పాటగా రికార్డు సృష్టించింది. గతంలో 'పుష్ప'లోని 'ఊ అంటావా మావా', 'దేవర'లోని 'చుట్టమల్లే' పేరిట ఉన్న రికార్డులను 'యశనగుల' అధిగమించడంతో అభిమానుల్లో సంబరాలు మొదలయ్యాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఎస్ఎల్‌వీ సినిమాస్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. కాయదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్‌బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. థియేటర్లలో అడుగుపెట్టకముందే సాంగ్‌తో రికార్డు కొట్టిన 'ది ప్యారడైజ్'.. వెండితెరపై ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి.

# 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ

## భీకరమైన 'కమలారెడ్డి' రోల్

మంచు మనోజ్ కథానాయకుడిగా, హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'పై అంచనాలు పెంచే కీలక అప్‌డేట్ వచ్చింది. నటి రమ్యకృష్ణ ఈ సినిమాలో కమలారెడ్డి పాత్రలో కనిపించనున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ రమ్యకృష్ణ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో ఆమె పాత్రలోని తీవ్రత, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ స్పష్టంగా కనిపించేలా డిజైన్ చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ రమ్యకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆమెతో కలిసి నటించడం గౌరవంగా భావిస్తున్నానని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషాప్కా ఈ చిత్రంలో క్లారా విట్‌మోర్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమె ప్రేమలో సున్నితత్వం ఉండదని, క్రూరత్వమే ఉంటుందని దర్శకుడు హనుమ రెడ్డి గతంలో ఆసక్తికరంగా వెల్లడించారు. మంచు మనోజ్ 21 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గతేడాది ఆగస్టులో 'డేవిడ్ రెడ్డి' టైటిల్‌ను ప్రకటించారు.





# 'కింగ్' రిలీజ్‌పై షారుక్ క్లారిటీ..!

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ నటిస్తున్న భారీ చిత్రం 'కింగ్' విడుదలపై కొంతకాలంగా కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడింది. సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్స్ పెద్దగా లేకపోవడం, అదే సమయంలో పలు హాలీవుడ్ భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండటంతో 'కింగ్' వాయిదా పడుతుందన్న ప్రచారం ఊపందుకుంది. అయితే అభిమానులతో ఎక్స్‌లో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో షారుక్ ఖాన్ స్వయంగా దీనిపై స్పష్టత ఇచ్చారు. డిసెంబర్ 24న 'కింగ్' అనుకున్న తేదీకే ప్రేక్షకుల ముందుకు వస్తుందని ఆయన వెల్లడించారు. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్‌తో కలిసి సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు సమయం తీసుకుంటున్నామని, అభిమానులు, ప్రేక్షకులు పూర్తిస్థాయిలో ఆస్వాదించేలా 'కింగ్'ను సిద్ధం చేస్తున్నామని షారుక్ తెలిపారు. ఈ సినిమా కోసం తాను కొన్ని గాయాలను కూడా ఎదుర్కొన్నానని చెప్పిన ఆయన.. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలు, కామెడీ కూడా సినిమాలో ఉంటాయని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. సుహానా ఖాన్, దీపికా పదుకొణె, రాణీ ముఖర్జీ, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్, అభయ్ వర్మ, అర్షద్ వార్సీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దీంతో 'కింగ్'పై నెలకొన్న అంచనాలు మరింత పెరిగాయి. డిసెంబర్ 24న బాక్సాఫీస్ బరిలోకి దిగనున్న షారుక్.. ఈసారి ఎలాంటి సంచలనాన్ని సృష్టిస్తాడో చూడాలి.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.